

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 08-06-2026 | సంపుటి - 29 | సంచిక -12 | రూ : 4 | పేజీలు: 8

## తెలంగాణ హక్కులు
# ఏపీకి తాకట్టు...

- చంద్రబాబు ఆనందం కోసం నీటి వాటాల్లో రేవంత్ రాజీ
- గోదావరికావేరి అనుసంధానంతో రాష్ట్రానికి తీవ్ర నష్టం : మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి మెప్పు కోసం తెలంగాణ నీటి వాటాలను సీఎం రేవంత్‌రెడ్డి తాకట్టు పెడుతున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గోదావరి, కృష్ణా జలాల వాటాల విషయంలో రాష్ట్ర

తరువాయి 2లో





# అనుమతులు ఎందుకివ్వరు?

- 50 సార్లు ఢిల్లీ వెళ్లినా స్పందించరేం?
- తుమ్మిడిహెట్టి, మెట్రోను కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారు
- మెట్రో విస్తరణ, ఆర్ఆర్ఆర్ కావాల్సిందే..
- 70 లక్షల టన్నుల ధాన్యంలో 50 లక్షలే కొంటామంటే ఎలా?
- వీటన్నిటిపైనా 15 తర్వాత కార్యాచరణ చేపడతాం
- ఉప్పల్ సభలో సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడి

2లో





## పసిడి తగ్గుదల
# మూడో రోజు ఊరట..


- తులం బంగారం ధర రూ.1.53 లక్షల కంటే దిగువకు పతనం
- అంతర్జాతీయ పరిణామాలు, దేశీయంగా డిమాండ్ తగ్గడమే ప్రధాన కారణం
- ఇటీవలి గరిష్ఠ స్థాయిల నుంచి గణనీయంగా దిగివచ్చిన పసిడి
- బంగారం బాటలోనే వెండి ధరలు కూడా తగ్గుముఖం

2లో

## భూమిపైకి సౌర తుపాను
# రేపు 'జీ3' స్థాయి హెచ్చరిక!

- జూన్ 8న సౌర తుపాను భూమిని తాకే అవకాశం ఉందని శాస్త్రవేత్తల అంచనా
- NOAA నుంచి జీ3 (తీవ్రమైన) జియోమ్యాగ్నెటిక్ స్టార్మ్ హెచ్చరిక జారీ
- తక్కువ అక్షాంశాల వద్ద కూడా అరోరా కాంతులు కనిపించే అవకాశం
- విద్యుత్ గ్రిడ్లు, కమ్యూనికేషన్ వ్యవస్థలపై స్వల్ప ప్రభావం
- పెద్ద ఎత్తున నష్టం జరగకపోవచ్చని అంచనా

2లో



## జిల్ బైడెన్ ఆత్మకథలో
# ప్రధాని మోదీ వజ్రం కథ



- ప్రధాని మోదీ బహూకరించిన ల్యాబ్‌గ్రోన్ వజ్రంపై జిల్ బైడెన్ ఆసక్తి
- యూఎస్ నిబంధనల ప్రకారం వజ్రం ప్రభుత్వ సొత్తుగా గుర్తింపు
- మోదీ చెప్పిన ధర కంటే అమెరికా అధికారులు కట్టిన విలువే ఎక్కువ
- ధర భారీగా ఉండటంతో సొంతం చేసుకోలేకపోయిన మాజీ ఫస్ట్ లేడీ
- అధికారిక ఈవెంట్లలో ధరించి, వైట్ హౌస్ వీడాక తిరిగి ప్రభుత్వానికి అప్పగింత

2లో




# సైబర్ ఖాతాల బాధితులకు
# భారీ ఊరట

- స్తంభింపజేసిన ఖాతాలు ఆన్‌లైన్‌లోనే అన్‌ఫ్రీజ్!
- ఐ4సీ ప్రయోగాత్మక చర్యలు
- త్వరలోనే అధికారికంగా అందుబాటులోకి

హైదరాబాద్: సైబర్ నేరస్థుల ఖాతాల్లోంచి మీ ఖాతాలకు డబ్బులు జమయ్యాయంటూ బ్యాంకు అధికారులు ఖాతాలు స్తంభింపజేస్తుంటారు.. మ్యూల్ ఖాతాలతో లావాదేవీలు జరిపారంటూ పోలీసులు కూడా ఎకౌంట్‌లు ఫ్రీజ్ చేస్తుంటారు.. దీంతో ఏం చేయాలో తెలియక, ఎవరిని సంప్రదించాలో అర్థంగాక చాలామంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గడిచిన 20 నెలల వ్యవధిలో దేశవ్యాప్తంగా దాదాపు 27 లక్షల ఖాతాలు ఇలా నిలిపివేశారు. ఇలాంటి సైబర్ ఖాతాల బాధితులకు త్వరలోనే ఊరట కలగనుంది. బ్యాంకులు, పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరగకుండా, ఉన్నచోటి నుంచే సమస్య

తరువాయి 2లో

## అమెరికాలో మళ్లీ కాల్పుల కలకలం..
# టోలెడోలో విషాదం

- టోలెడో ఉత్సవంలో శనివారం సాయంత్రం కాల్పులు
- ఇద్దరు దుండగుల పరస్పర కాల్పుల్లో 12 మందికి గాయాలు
- గాయపడిన వారిలో పిల్లలు, వృద్ధులు
- కాల్పుల నేపథ్యంలో మిగిలిన ఫెస్టివల్ కార్యక్రమాల రద్దు
- పరారీలో ఉన్న నిందితుల కోసం పోలీసులు గాలింపు

2లో





# ప్రపంచవ్యాప్తంగా కొత్త పోకడ..
## అసలేమిటీ 'గ్రే మేరేజస్'..?

- అరవై ఏళ్లు దాటిన వారు పెళ్లి చేసుకోవడమే దీని ఉద్దేశం
- వృద్ధాప్యంలో ఒంటరితనాన్ని దూరం చేసి, తోడు కోసమే ఈ నిర్ణయాలు
- ఈ వివాహాల్లో కుటుంబ, ఆర్థికపరమైన సవాళ్లు
- ఆస్తి సమస్యల కారణంగా కొందరు పెళ్లికి బదులుగా సహజీవనాన్ని ఎంచుకుంటున్న వైనం

2లో

# భూమిపైకి సౌర తుపాను: రేపు 'జీ3' స్థాయి హెచ్చరిక!

సూర్యుడి నుంచి వెలువడిన ఒక భారీ సౌర తుపాను భూమి వైపు వేగంగా దూసుకొస్తోంది. ఈ తుపాను రేపు (జూన్ 8) సోమవారం నాటికి భూమిని తాకే అవకాశం ఉందని అమెరికాకు చెందిన నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్ (NOAA) స్పేస్ వెదర్ ప్రిడిక్షన్ సెంటర్ (SWPC) అంచనా వేసింది. ఈ నేపథ్యంలో జీ3 (తీవ్రమైన) స్థాయి జియోమ్యాగ్నెటిక్ తుపాను హెచ్చరికను జారీ చేసింది. జూన్ 9న కూడా జీ2 స్థాయి ప్రభావం ఉండొచ్చని తెలిపింది. జూన్ 6న సూర్యుడిపై ఉన్న యాక్టివ్ రీజియన్ 4461 నుంచి ఈ సౌర విస్ఫోటనం (కరోనల్ మాస్ ఎజెక్షన్) సంభవించింది. ఇది సెకనుకు సుమారు 1,400 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తున్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ సౌర తుపాను భూమి అయస్కాంత క్షేత్రంతో కలిసినప్పుడు జియోమ్యాగ్నెటిక్ తుపాను ఏర్పడుతుంది. ఈ తుపాను ప్రభావంతో సాధారణంగా ధ్రువ ప్రాంతాల్లో కనిపించే అరోరా కాంతులు (నార్తర్న్, సదరన్ లైట్స్) తక్కువ అక్షాంశాల వద్ద కూడా కనిపించే అవకాశం ఉంది. ఉత్తర భారతదేశం, ఐరోపాలోని కొన్ని ప్రాంతాలు, అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లలో వాతావరణం అనుకూలిస్తే ఈ అద్భుత దృశ్యాలను వీక్షించవచ్చు. అయితే ఉత్తరార్ధగోళంలో వేసవి కారణంగా రాత్రి సమయం తక్కువగా ఉండటం వీక్షణకు కొంత ఆటంకం కలిగించవచ్చు. జీ3 స్థాయి తుపాను వల్ల పవర్ గ్రిడ్లలో స్వల్ప హెచ్చుతగ్గులు, శాటిలైట్ నావిగేషన్ వ్యవస్థల్లో చిన్నపాటి సమస్యలు, హై ఫ్రీక్వెన్సీ రేడియో కమ్యూనికేషన్లకు అంతరాయాలు ఏర్పడవచ్చని నిపుణులు చెబుతున్నారు. అయితే, పెద్ద ఎత్తున నష్టం జరగకపోవచ్చని అంచనా వేస్తున్నారు. సూర్యుడు ప్రస్తుతం సోలార్ సైకిల్ 25లో చురుకైన దశలో ఉండటంతో ఇలాంటి సంఘటనలు తరచుగా జరుగుతున్నాయని శాస్త్రవేత్తలు వివరించారు.

## చంద్రబాబు ట్వీట్: సిద్ధాంతంలో రేపు భేటీ

సోషల్ మీడియాలో వైరల్ అయిన ఒక వీడియోపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించి, ఒక సామాన్య అభిమాని కోరికను తీర్చడానికి ముందుకొచ్చారు. తనను కలవాలని ఆశగా ఎదురుచూస్తున్న పెద్దాయనను ఉద్దేశించి, "సత్యనారాయణ గారూ.. రేపు సిద్ధాంతంలో కలుద్దాం" అని ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా శుక్రవారం పోస్ట్ చేశారు.

**అసలేం జరిగిందంటే..**

ఆంధ్రప్రదేశ్‌లోని కామధేనువులంక గ్రామానికి చెందిన సత్యనారాయణ అనే వృద్ధుడితో ఒక యువకుడు మాట్లాడిన వీడియో ఇటీవల సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యింది. ఆ వీడియోలో, "చంద్రబాబును ఎప్పుడైనా చూశారా?" అని యువకుడు అడగ్గా, "ఆయన హైదరాబాద్‌లో ఉంటారని అంటారు, నేనైతే చూడలేదు" అని పెద్దాయన అమాయకంగా బదులిచ్చారు. "ఆయన్ను కలవాలని ఉందా?" అని అడగ్గా, సత్యనారాయణ గారు ఎంతో ఉత్సాహంగా, చూడాలనే కోరిక ఉందని చెప్పారు. దీంతో ఆ యువకుడు, ఈ నెల 9న ముఖ్యమంత్రి సిద్ధాంతం వస్తున్నారని, తాను తప్పకుండా కలిసేలా చేస్తానని హామీ ఇచ్చారు. ఆ మాట వినగానే సత్యనారాయణ గారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఈ హృద్యమైన వీడియో ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి చేరింది. దీనిపై తక్షణమే స్పందించిన ఆయన, పెద్దాయన కోరికను మన్నిస్తూ నేరుగా ఆయన్నే కలుస్తానని ప్రకటించారు. సిద్ధాంతంలో తన పర్యటన సందర్భంగా సత్యనారాయణ గారిని కలవనున్నట్లు ఆయన చేసిన ట్వీట్ ఇప్పుడు అందరి ప్రశంసలు అందుకుంటోంది. ఒక సామాన్యుడి కోరికకు ముఖ్యమంత్రి ఇంత త్వరగా స్పందించడంపై నెటిజన్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పసిడి తగ్గుదల: మూడో రోజు ఊరట



దేశీయ మార్కెట్లో బంగారం ధరలు వరుసగా మూడో రోజు కూడా తగ్గుముఖం పట్టాయి. అంతర్జాతీయంగా ప్రతికూల సంకేతాలు తోడవడమే కాకుండా, దేశీయంగా డిమాండ్ మందగించడంతో పసిడి ధరలు దిగివస్తున్నాయి. జూన్ 7 నాటి ట్రేడింగ్‌లో, 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు సుమారు రూ.300 తగ్గి, రూ.1,52,730 వద్దకు చేరింది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల ఆభరణాల బంగారం ధర రూ.1,40,000 వద్ద కొనసాగుతోంది. నగరంలో కిలో వెండి ధర రూ.2.7 లక్షలుగా నమోదైంది. విజయవాడలో కూడా ఇవే ధరలు కొనసాగుతున్నాయి. ఇక దేశంలోని ఇతర ప్రధాన నగరాల విషయానికి వస్తే.. చెన్నైలో ప్రస్తుతం 24 క్యారెట్ల పది గ్రాముల పసిడి ధర రూ.1,54,910గా ఉండగా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,42,000గా ఉంది. ముంబైలో పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,52,730 వద్ద, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,40,000 వద్ద కొనసాగుతోంది. దేశ రాజధాని న్యూఢిల్లీలో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,55,910గా ఉంది. 22 క్యారెట్ల పసిడి ధర రూ.1,40,150 వద్ద కొనసాగుతోంది. నిన్న భారత మార్కెట్లో మేలిమి బంగారం సగటు ధర రికార్డు స్థాయిలో రూ.3,000 మేర తగ్గగా, వెండి ధరలోనూ రూ.10,000 మేర కోత పడింది.

## సైబర్ ఖాతాల బాధితులకు భారీ ఊరట

హైదరాబాద్: సైబర్ నేరస్థుల ఖాతాల్లోంచి మీ ఖాతాలకు డబ్బులు జమయ్యాయంటూ బ్యాంకు అధికారులు ఖాతాలు స్తంభింపజేస్తుంటారు.. మ్యూల్ ఖాతాలతో లావాదేవీలు జరిపారంటూ పోలీసులు కూడా ఎకౌంట్‌లు ఫ్రీజ్ చేస్తుంటారు.. దీంతో ఏం చేయాలో తెలియక, ఎవరిని సంప్రదించాలో అర్థంగాక చాలామంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గడిచిన 20 నెలల వ్యవధిలో దేశవ్యాప్తంగా దాదాపు 27 లక్షల ఖాతాలు ఇలా నిలిపివేశారు. ఇలాంటి సైబర్ ఖాతాల బాధితులకు త్వరలోనే ఊరట కలగనుంది. బ్యాంకులు, పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరగకుండా, ఉన్నచోటి నుంచే సమస్య పరిష్కరించేలా ఇండియన్ సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) చర్యలు తీసుకుంటోంది. ఇది అందుబాటులోకి వస్తే ఖాతాలు నిలిపివేయడం వల్ల ఇబ్బందులు పడుతున్న వారు ఆన్‌లైన్‌లోనే ఫిర్యాదు చేయవచ్చు. సైబర్ నేరాల్లో వారి ప్రమేయం లేకపోతే వెంటనే బ్యాంకు ఖాతాను పునరుద్ధరిస్తారు.

**విమర్శల నేపథ్యంలో..**

సైబర్ నేరగాళ్లు తమ ఉనికి బయటపడకుండా దోచుకున్న సొమ్మును మ్యూల్ ఖాతాల్లోకి మళ్లిస్తున్న సంగతి తెలిసిందే. అంటే అద్దె ప్రాతిపదికన ఖాతాలు సమకూర్చుకొని, కొట్టేసిన డబ్బును తొలుత వాటిలోకి జమచేసి, అక్కడ నుంచి వేర్వేరు ఖాతాలకు మళ్లించి.. చివరగా విదేశాలకు తరలిస్తున్నారు. డబ్బు వస్తుందన్న ఆశతో కొంతమంది వారికి తమ బ్యాంకు ఖాతాలు ఇచ్చి చిక్కుల్లో పడుతున్నారు. ఒక మ్యూల్ ఖాతాతో లావాదేవీలు జరిపినా ప్రతి ఖాతాను స్తంభింపజేయడం అనేది విమర్శలకు దారి తీస్తోంది. ఉదాహరణకు ఒక యువకుడు తన ఖాతాను నేరగాళ్లకు అద్దెకు ఇచ్చాడనుకోండి. అందులో పడ్డ డబ్బును నేరగాళ్లు చెప్పిన ఖాతాల్లోకి మళ్లించాడు. కానీ నేరంతో సంబంధం లేకపోయినా ఆర్థిక లావాదేవీలకు సంబంధించి అతడు మరికొంత మందికి డబ్బు బదిలీ చేసి ఉండవచ్చు. వారు మరికొందరికి బదిలీ చేసి ఉండవచ్చు. ఇలా ఒక మ్యూల్ ఖాతా నుంచి ఎన్ని ఖాతాల్లోకి డబ్బు బదిలీ అవుతుందో వాటన్నింటినీ స్తంభింపజేస్తున్నారు. దాంతో ఏ నేరమూ చేయని బాధితులు లబోదిబోమంటున్నారు. ఎక్కడో బిహార్, ఉత్తర్‌ప్రదేశ్‌లోని మారుమూల పోలీస్‌స్టేషన్ నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు ఖాతా నిలిపివేశామని, పునరుద్ధరించుకోవాలంటే వారినే సంప్రదించాలని చెబుతూ బ్యాంకు అధికారులు చేతులు దులుపుకొంటున్నారు. వారిని ఎలా సంప్రదించాలో తెలియక ఖాతాదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

**నిర్ధారిస్తే వెంటనే చర్యలు**

దీనిపై దేశవ్యాప్తంగా పెద్దఎత్తున ఫిర్యాదులు వెల్లువెత్తుతుండటంతో అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఐ4సీ రంగంలోకి దిగింది. ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసే అవకాశం కల్పించనుంది. ఏ కారణంతో తమ ఖాతా స్తంభింపజేశారో బాధితుడు ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చు. అంతేకాదు.. తమ ఖాతాలోకి ఎవరి నుంచి డబ్బు బదిలీ అయింది.. కారణాలేంటి.. ఆ వ్యక్తితో ఉన్న లావాదేవీల వంటి వాటికి సంబంధించిన ధ్రువీకరణపత్రాలు కూడా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయవచ్చు. అధికారులు వీటన్నింటినీ పరిశీలించి, నిజంగానే సైబర్ నేరాలతో సంబంధం లేదని నిర్ధారిస్తే వెంటనే ఖాతా పునరుద్ధరిస్తారు. ప్రస్తుతం ఈ సదుపాయం ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్నారు. త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి రానుందని సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు చెబుతున్నారు.

## తెలంగాణ హక్కులు ఏపీకి తాకట్టు

హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి మెప్పు కోసం తెలంగాణ నీటి వాటాలను సీఎం రేవంత్‌రెడ్డి తాకట్టు పెడుతున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గోదావరి, కృష్ణా జలాల వాటాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని తప్పు పట్టారు. పాలమూరురంగారెడ్డికి 90 టీఎంసీలు, డిండి ప్రాజెక్టుకు 20 టీఎంసీల నీటికి ఏపీ ఎన్‌వోసీ ఇస్తే పోలవరం ప్రాజెక్ట్‌కు అనుకూలమని చెప్పడం పట్ల ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. దీని వల్ల అత్యధికంగా పాలమూరు జిల్లాకు నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. "పాలమూరుకు కేటాయించిన 90 టీఎంసీల్లో 45 మైనర్ ఇరిగేషన్, 45 డైవర్షన్ లో వచ్చేవి. పాతవి 811, కొత్తగా బ్రిజేష్ ట్రిబ్యునల్ చెప్పిన 194 కలిపితే 1005 టీఎంసీలు పున:పంపిణీ కింద సంక్రమిస్తాయి. అలాగే మరో 45 టీఎంసీల నీటిని తెలంగాణకు ఇచ్చే విషయం ట్రిబ్యునల్ తేల్చబోతున్నది. మొత్తంగా 1050లో కనిష్టంగా 700 టీఎంసీలు రాబోతున్నాయి. ముఖ్యమంత్రి మాత్రం 90 టీఎంసీలకు ఎన్‌ఓసీ ఇవ్వండి అన్ని నీళ్లు విడిచిపెట్టుకుంటం అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల వల్ల నీటి వాటాల్లో తెలంగాణకు అన్యాయం జరగనుంది" అని హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. గోదావరిలో కేటాయించిన 968 టిఎంసీలు, కృష్ణాలో రానున్న 1050 టీఎంసీల నీటికి సంబంధించిన ప్రాజెక్టుల క్లియరెన్స్ పూర్తయిన తర్వాతనే నదుల అనుసంధానం ప్రక్రియ గురించి మాట్లాడాలన్నారు.

## జిల్ బైడెన్ ఆత్మకథలో ప్రధాని మోదీ వజ్రం కథ

భారత ప్రధాని నరేంద్ర మోదీ గతంలో తనకు బహూకరించిన ఒక అరుదైన వజ్రాన్ని తన వద్దే ఉంచుకోవాలని అనుకున్నానని, కానీ అమెరికా ప్రభుత్వ నిబంధనలు, దాని భారీ విలువల కారణంగా చివరికి దానిని వెనక్కి ఇచ్చేయాల్సి వచ్చిందని అమెరికా మాజీ ఫస్ట్ లేడీ డాక్టర్ జిల్ బైడెన్ వెల్లడించారు. ఈ వారం మార్కెట్లోకి విడుదలైన ఆమె ఆత్మకథ 'వ్యూ ఫ్రమ్ ద ఈస్ట్ వింగ్: ఎ మెమోయిర్' పుస్తకంలో వైట్ హౌస్ జీవితం, విదేశీ పర్యటనల్లో వచ్చే బహుమతులపై ఉండే కఠినమైన నిబంధనల గురించి ఆమె పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. 2023 జూన్‌లో ప్రధాని మోదీ అమెరికాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ఆయన జిల్ బైడెన్‌కు భారతదేశంలో స్వదేశీ సాంకేతికతతో తయారు చేసిన 7.5 క్యారెట్ల కృత్రిమ వజ్రాన్ని బహుమతిగా ఇచ్చారు. "ఆ వజ్రం చాలా అద్భుతంగా ఉంది. ల్యాబ్‌గ్రోన్ వజ్రాల తయారీలో భారత్ సాధించిన ప్రగతికి అది ఒక ప్రతిరూపం. ఆ గిఫ్ట్ నన్ను ఎంతగానో ఆకర్షించింది" అని జిల్ బైడెన్ తన పుస్తకంలో రాసుకొచ్చారు.

**రూల్స్ అడ్డుపడ్డాయి**

అమెరికా నైతిక నిబంధనల ప్రకారం వైట్ హౌస్ అధికారిక హోదాలో అందుకునే ఏ బహుమతి అయినా వ్యక్తిగత సొత్తు కాదు, అది అమెరికా ఫెడరల్ ప్రభుత్వానికే చెందుతుంది. అయితే, సదరు బహుమతిని మార్కెట్ ధర చెల్లించి సొంతం చేసుకునే అవకాశం ఉంటుంది. "ఈ వజ్రం తన సొంత ఊరిలో 2,500 డాలర్ల (దాదాపు రూ. 2 లక్షలు)తో తయారైందని, దానికి సంబంధించిన బిల్లు కూడా ఉందని ప్రధాని మోదీ నాతో చెప్పారు. దాంతో, అంత తక్కువ ధర అయితే నేనే డబ్బులు కట్టి ఆ వజ్రాన్ని కొనేద్దామని అనుకున్నాను" అని జిల్ బైడెన్ పేర్కొన్నారు. కానీ, ఆమె ప్లాన్ కాస్తా అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ వాల్యుయేషన్‌తో మారిపోయింది. అమెరికా అధికారులు ఆ వజ్రాన్ని పరిశీలించి దాని విలువ ఏకంగా 20,000 డాలర్లు (సుమారు రూ. 16.6 లక్షలు)గా నిర్ధారించారు. మోదీ చెప్పిన ధర కంటే అధికారులు కట్టిన విలువ చాలా ఎక్కువగా ఉండటంతో ఆమె ఆ వజ్రాన్ని సొంతంగా కొనాలనే ఆలోచనను విరమించుకున్నారు. ఆ తర్వాత నిబంధనల ప్రకారం ఆ వజ్రాన్ని కేవలం అధికారిక వేడుకల కోసం అద్దెకు తీసుకునే (Borrow) వెసులుబాటు ఉండటంతో.. జిల్ బైడెన్ దాన్ని ఒక ఉంగరంలో చేయించుకుని వైట్ హౌస్ ఈవెంట్లలో ధరించారు. అయితే, బైడెన్ ప్రభుత్వం ముగిసి వైట్ హౌస్ నుంచి బయటకు వచ్చేటప్పుడు ఆ ఉంగరాన్ని తిరిగి ప్రభుత్వ స్టోరేజ్ రూమ్‌కు అప్పగించినట్లు ఆమె తెలిపారు. ఇదే సందర్భంలో ఫ్రెంచ్ ఫస్ట్ లేడీ బ్రిగిట్టే మాక్రాన్ ఇచ్చిన బ్రాస్‌లెట్ ధర తక్కువగా ఉండటంతో తానే సొంత డబ్బులు పెట్టి కొనుక్కున్నానని, ఉక్రెయిన్ ఇచ్చిన ఒక బ్రోచ్ విలువను అధికారులు 14,063 డాలర్లుగా తేల్చారని జిల్ బైడెన్ తన పుస్తకంలో గుర్తు చేసుకున్నారు.

## ప్రపంచవ్యాప్తంగా కొత్త పోకడ.. అసలేమిటీ 'గ్రే మేరేజెస్'..?

ఒకప్పుడు పెళ్లిళ్లంటే పాతికేళ్లకే అనేవారు. కానీ ఇప్పుడు కాలం మారింది. అరవై ఏళ్లు దాటిన తర్వాత కూడా వివాహ బంధంలోకి అడుగుపెట్టే వారి సంఖ్య నెమ్మదిగా పెరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తున్న ఈ కొత్త పోకడను 'గ్రే మ్యారేజెస్' అని పిలుస్తున్నారు. జుట్టు నెరిసిన తర్వాత పెళ్లి చేసుకోవడాన్ని ఉద్దేశించి 'గ్రే మేరేజెస్' అంటున్నారు. ప్రజల్లో ఆరోగ్య స్పృహ కారణంగా పెరుగుతున్న ఆయుర్దాయం, మారుతున్న సామాజిక దృక్పథాలు ఈ మార్పుకు కారణమవుతున్నాయి. 50, 60 ఏళ్లు దాటిన వారు, పెద్ద వయసులో జీవిత భాగస్వాములను కోల్పోయిన వారు ఒంటరి జీవితానికి స్వస్తి పలికి, పెళ్లి చేసుకోవడాన్నే 'గ్రే మ్యారేజెస్' లేదా 'లేట్ లైఫ్ మ్యారేజెస్' అని పిలుస్తున్నారు. ఇది కేవలం పాశ్చాత్య దేశాలకే పరిమితం కాకుండా, మన దేశంలోనూ క్రమంగా ప్రాచుర్యం పొందుతోంది.

**తోడు కోసమే ప్రధానంగా..**

ఈ తరహా వివాహాలకు ప్రధాన కారణం వృద్ధాప్యంలో ఎదురయ్యే ఒంటరితనం. పిల్లలు చదువులు, ఉద్యోగాల రీత్యా ఎదిగి దూరంగా స్థిరపడిన తర్వాత తల్లిదండ్రుల్లో చాలా మంది జీవిత భాగస్వాములను కోల్పోయి, ఏకాంతంతో బాధపడుతుంటారు. ఈ క్రమంలో జీవిత చరమాంకంలో ప్రేమ, ఆప్యాయత, భావోద్వేగ మద్దతు కోసం ఒక తోడు అవసరమని భావిస్తున్నారు. మానసిక ప్రశాంతత, ఒకరికొకరు ధైర్యం చెప్పుకోవడానికి, సంతోషాలను పంచుకోవడానికి సహచరి లేదా సహచరుడు ఉంటే జీవితానికి కొత్త అర్థం వస్తుందని నమ్ముతున్నారు. అంతేకాకుండా, ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు ఒకరికొకరు అండగా నిలవడం, రోజువారీ పనుల్లో సహాయం చేసుకోవడం వంటి ఆచరణాత్మక ప్రయోజనాలు కూడా ఈ నిర్ణయానికి దారితీస్తున్నాయి. పెరిగిన ఆయుర్దాయం, మారుతున్న సామాజిక దృక్పథాలు ఈ ధోరణికి మరింత ఊతమిస్తున్నాయి.

**సవాళ్లు, చిక్కుముడులు లేకపోలేదు..**

అయితే, ఈ ప్రయాణం పూర్తిగా పూలపాన్పు కాదు. ఇందులో అనేక సవాళ్లు, చిక్కుముడులు కూడా ఉన్నాయి. ముఖ్యంగా రెండు కుటుంబాలను కలపడం, ఇప్పటికే పెద్దవాళ్లైన పిల్లల అభిప్రాయాలను గౌరవించడం, వారి అంగీకారం పొందడం ఒక పెద్ద సవాలుగా మారుతోంది. చాలా సందర్భాల్లో పిల్లల నుంచి వ్యతిరేకత ఎదురవుతుంటుంది. అంతేకాకుండా, ఆర్థిక, చట్టపరమైన సమస్యలు కూడా చాలా క్లిష్టంగా ఉంటాయి. వారసత్వ హక్కులు, ఆస్తుల పంపకం, పెన్షన్, బీమా, ఆరోగ్య సంరక్షణ హక్కులు, ఎస్టేట్ ప్లానింగ్ వంటి విషయాల్లో స్పష్టత అవసరం. ఈ వివాహాల వల్ల తమ వారసత్వ ఆస్తులకు ఎక్కడ ఇబ్బంది వస్తుందోనని పిల్లలు ఆందోళన చెందడం సహజం. ఈ సమస్యలను అధిగమించడానికి చాలా మంది పెళ్లికి ముందే న్యాయ సలహాలు తీసుకుంటున్నారు. ఇటువంటి చట్టపరమైన చిక్కులను నివారించేందుకే కొందరు వృద్ధులు పెళ్లికి బదులుగా సహజీవనాన్ని ఎంచుకుంటున్నారు. ఒకప్పుడు అరవై ఏళ్ల వయసులో పెళ్లి అంటే వింతగా, విమర్శనాత్మకంగా చూసే సమాజంలో ఇప్పుడు మార్పు వస్తోంది. వయసుతో సంబంధం లేకుండా వ్యక్తిగత సంతోషం, సంతృప్తి ముఖ్యమనే భావనకు ఆమోదం పెరుగుతోంది. సవాళ్లు ఉన్నప్పటికీ, వృద్ధాప్యంలో ఒంటరితనానికి పరిష్కారంగా, కొత్త జీవితానికి నాందిగా 'గ్రే మ్యారేజెస్' నిలుస్తున్నాయి.

## అనుమతులు ఎందుకివ్వరు?

హైదరాబాద్, ఉప్పల్: ''హైదరాబాద్ మహానగరానికి మెట్రో రెండో దశ కావాలి.. రీజినల్ రింగ్ రోడ్డుకు అనుమతులు ఇవ్వాల్సిందే.. మూసీ ప్రక్షాళన జరగాల్సిందే.. తెలంగాణలో పండించిన వడ్లు, మక్కలు, జొన్నలను కేంద్రం కొనాల్సిందే.. వీటి కోసం 15వ తేదీ తర్వాత కార్యాచరణ చేపడతాం'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు కోసం మహారాష్ట్ర సీఎంతో భేటీ కానీయకుండా.. 122 కిలోమీటర్ల మెట్రో రెండో దశను రానీయకుండా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని ఉప్పల్ భగాయత్‌లో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ భవనం సహా రూ.1511 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు సీఎం ఆదివారం రాత్రి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు డి.శ్రీధర్‌బాబు, దామోదర్ రాజనర్సింహ, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగసభలో సీఎం మాట్లాడారు.

**అనుమతులను అడ్డుకుంటున్నదెవరు?**

''రెండున్నరేళ్లుగా 50 సార్లు ఢిల్లీ వెళ్లా. ఐదుసార్లు ప్రధానమంత్రి మోదీని కలిశా. అయినా అనుమతులు ఎందుకు ఆగుతున్నాయి? ఎవరు ఆపుతున్నారు? కిషన్‌రెడ్డిని ప్రజలు ఓట్లు వేసి గెలిపించలేదా? మూసీ ప్రక్షాళనకు నిధులు, ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణం, తెలంగాణలో పండిన ధాన్యం కొనుగోలు బాధ్యత ఆయనకు లేదా? రాష్ట్రంలో 75 లక్షల టన్నుల ధాన్యం పండితే 50 లక్షల టన్నులే కొంటామంటే ఎలా? పంజాబ్ నుంచి 86 శాతం, భాజపా పాలిత రాష్ట్రాల నుంచి 80 శాతం ధాన్యం కొంటున్నారు. సబర్మతి, గంగా, యమునా రివర్ ఫ్రంట్‌లను అభివృద్ధి చేసుకుంటారు కానీ.. మూసీ ప్రక్షాళన చేయకూడదా? రెండో స్థానంలో ఉన్న హైదరాబాద్ మెట్రో ఈ రోజు 9వ స్థానానికి పడిపోయింది. మెట్రో విస్తరణకు కిషన్‌రెడ్డి అడ్డుపడుతున్నారు. భారాస నాయకులు, కేటీఆర్ చెప్పినట్లే కిషన్‌రెడ్డి వింటారని భాజపా కార్యకర్తలే ఆరోపిస్తున్నారు. తుమ్మిడిహెట్టి, మెట్రోకు అనుమతి, మూసీ ప్రక్షాళనకు నిధులు.. వడ్లన్నీ కేంద్రంతో కొనిపించడం.. ఇవన్నీ చేస్తే కిషన్‌రెడ్డికి ఎల్‌బీ స్టేడియంలో లక్ష మందితో సభ ఏర్పాటు చేసి.. గండపెండేరంతో సత్కరిస్తాం. రాజకీయాలకు అతీతంగా హైదరాబాద్ మహానగరాన్ని అభివృద్ధి చేసుకుందాం. ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలు. రానున్న రెండేళ్లు నగర అభివృద్ధిపై దృష్టిసారిద్దాం. ప్రజాప్రతినిధులెవరైనా సరే.. పార్టీలకు అతీతంగా పనులు చేయించే బాధ్యత నాది.

*** మహిళలకు ముందువరుసలో చోటివ్వండి**

ప్రతి సభలో మహిళలకు ముందు కూర్చునే అవకాశం ఇవ్వాలి. వేదికకు కుడివైపున మహిళలు మొదటి వరుసల్లో ఉండేలా చూడాలి. మహిళల ఆశీస్సులతోనే జడ్పీటీసీ నుంచి ముఖ్యమంత్రి స్థాయికి వచ్చా. హైదరాబాద్‌లో పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, జీహెచ్ఎంసీ ఇలా నాలుగు రకాల పాలన ఉండేది. సమన్వయం లోపంతో సమస్యలు రావడం వల్లే మూడు కార్పొరేషన్లుగా విభజించాం. పురపాలన, పోలీసు సహా అన్ని విభాగాలను సమన్వయం చేసుకునేలా సరిహద్దులను నిర్దేశించాం.

# కార్మికుల శ్రమతో సింగరేణి సంస్థ మనుగడ సాగిస్తోంది

* **కొత్తగూడెం నియోజకవర్గ శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు**

ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కార్మికుల శ్రమతో సింగరేణి సంస్థ మనుగడ సాగిస్తోందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం నియోజకవర్గ శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం ఆర్‌సీఓఏ క్లబ్‌లో ఆదివారం జరిగిన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) కేంద్ర కౌన్సిల్ సమావేశంలో తొలిరోజు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్మికుల హక్కులు, సంక్షేమం, ఉద్యోగ భద్రతకు విఘాతం కలిగించే విధానాలను యాజమాన్యం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సింగరేణికి రావలసిన రూ.56 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, కొత్త గనుల ప్రారంభానికి చర్యలు చేపట్టాలన్నారు. , సంస్థకు మూలాధారమైన కార్మికులను యాజమాన్యం చిన్నచూపు చూస్తోందని, కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న యాజమాన్యం ఇకనైనా తన పంథాను మార్చుకోవాలని, లేనిపక్షంలో పోరాటాలు తప్పవన్నారు. ఈ సందర్భంగా సోమవారం సాయంత్రం 4 గంటలకు సింగరేణి ప్రధాన కార్యాలయం ముందు యూనియన్ నాయకుడు కొమురయ్య కాంస్య విగ్రహ పునఃప్రారంభోత్సవ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో




యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, అదనపు కార్యదర్శి మిర్యాల రంగయ్య, డిప్యూటీ జనరల్ సెక్రటరీలు సారయ్య, కందికట్ల వీరభద్రయ్య, వై.వి.రావు, సమ్మయ్య, సెంట్రల్ సెక్రటరీలు వంగ వెంకట్, వీరస్వామి, వివిధ ఏరియాల బ్రాంచ్ కార్యదర్శులు, సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

# గజల్ రాజేష్‌కు సాహిత్య వేతిక సన్మానం



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం పట్టణానికి చెందిన యువ గజల్ కవి, గాయకుడు రాజేష్‌ను గజల్ సాహిత్య వేదిక అధ్యక్షులు ఇరువింటి శర్మ, ప్రముఖ కవి రెంటాల వెంకటేశ్వరరావు చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం జరిగిన గజల్ సాహిత్య వేదిక 6వ వార్షికోత్సవం, 60 వసంతాల తెలుగు గజల్ వజ్రోత్సవం కార్యక్రమంలో కవులు, గాయకుల సమ్మేళనంలో రాజేష్ తన గజళ్లను వినిపించారు. గజల్ సాహిత్య వేదిక అధ్యక్షులు ఇరువింటి వేంకటేశ్వర శర్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విశ్వ విఖ్యాత గజల్ గాయకులు గజల్ శ్రీనివాస్, విశిష్ట అతిథిగా ప్రముఖ గజల్ కవి రెంటాల వేంకటేశ్వర రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాలలోని తెలుగు గజల్ కవులు గాయకులతో జరిగిన గజల్ కవి సమ్మేళనం సభికులను విశేషంగా ఆకట్టుకుంది. కోరుప్రోలు మాధవరావు, సూరారం శంకర్, ఆర్వీఎస్సెస్, ఎంబీడీ శ్యామల, కేశిరాజు కృష్ణ, ముకుంద శర్మ, గడ్డం శ్యామల, రసవిహారి, మొదలగు ప్రముఖ గజల్ కవులు, గాయకులు పాల్గొన్నారు.

# 18 ఏళ్లు పైపడిన మహిళలందరికీ చీరలు ఇవ్వాలి



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: 18 సంవత్సరాలు పైబడిన మహిళలందరికీ ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయాలని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ డిమాండ్ చేశారు. ఆదివారం నేతాజీ స్కూల్ ఆవరణలో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందరికీ ఒకే రంగు చీరలు కాకుండా వేరు వేరు రంగులు, నాణ్యత కలిగిన చీరలు ఇస్తే బాగుండేదని అన్నారు. ప్రస్తుతం పంపిణీ చేస్తున్న చీరల పట్ల ప్రజలు అయిష్టత వ్యక్తం చేస్తున్నారని అన్నారు. చీరల బదులు బతుకమ్మ, దసరా, రంజాన్, క్రిస్మస్ పండగల సమయాల్లో ఇంట్లోకి అవసరమైన పప్పులు, చక్కెర గోధుమపిండి, నూనె తదితర కిరాణా సరుకులు ఇస్తే ప్రజలు సంతోషిస్తారని అభిప్రాయపడ్డారు. చీరల పంపిణీలో ఆర్‌పిలు బానోత్ జానకి, మేడిపల్లి కవిత, డ్వాక్రా గ్రూప్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ ఆహార భద్రత దినోత్సవం సందర్భంగా జెన్‌కోలో ప్రత్యేక శిక్షణ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా , ప్రజాస్ఫూర్తి : ప్రపంచ ఆహార భద్రత దినోత్సవం సందర్భంగా భూపాలపల్లి జిల్లాలోని జెన్‌కోలో ఆదివారం కాంటీన్ కార్మికులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆహార భద్రత ప్రమాణాలపై అవగాహన పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సుమారు 50 మంది కాంటీన్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆహార భద్రత అధికారి జి. వరుణ్ రెడ్డి మాట్లాడుతూ, ఆహార తయారీ నుంచి వినియోగదారులకు చేరే వరకు ప్రతి దశలో భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఆహార పదార్థాల శుభ్రత, సరైన నిల్వ విధానాలు, వ్యక్తిగత పరిశుభ్రత, సురక్షిత వంట ప్రక్రియలు, కలుషితాన్ని నివారించే చర్యలపై సిబ్బందికి వివరంగా అవగాహన కల్పించారు. ఆహార భద్రత విషయంలో నిర్లక్ష్యం ప్రజారోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొంటూ, ప్రతి కాంటీన్ కార్మికుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ శిక్షణ ద్వారా సిబ్బందిలో ఆహార భద్రతపై అవగాహన మరింత పెరిగిందని, భవిష్యత్తులో సూచించిన ప్రమాణాలను కచ్చితంగా అమలు చేస్తామని పాల్గొన్న వారు తెలిపారు. ఈ కార్యక్రమం ఆహార భద్రత ప్రమాణాల అమలుకు దోహదపడటంతో పాటు సురక్షిత ఆహార పంపిణీ లక్ష్యానికి తోడ్పడిందని అధికారులు పేర్కొన్నారు.


# గోధుమవాగు వంతెనకు శాశ్వత పరిష్కారం కోరుతూ ఎంపీకి వినతి



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: కొత్తగూడెం పట్టణం, రామవరం ప్రాంతాలను కలుపుతూ 30వ నెంబరు జాతీయ రహదారిపై ఉన్న గోధుమవాగు బ్రిడ్జి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని కోరుతూ కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 15వ డివిజన్ కార్పొరేటర్ ఆకునూరి సుప్రియ ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డికి ఆదివారం వినతిపత్రం అందజేశారు. గుంతల కారణంగా చిన్నపాటి వర్షానికే బ్రిడ్జిపై నీళ్లు నిల్వ ఉండి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె వివరించారు. గుంతల కారణంగా ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొందన్నారు. తాత్కాలిక మరమ్మతులతో సమస్య పరిష్కారం కావడం లేదని, తరచూ ఈ సమస్య పునరావృతం అవుతుందని, నీటి నిల్వను నివారించేలా డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరిచి శాశ్వత పరిష్కారం చూపాలని ఎంపీని కోరారు. ఈ సమస్యపై సంబంధిత అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ సుప్రియ తెలిపారు.

# ప్రతి ఆదివారం ప్రజాయాత్ర – ప్రజాసమస్యల పరిష్కారమే ఎజెండా

* **మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి**



మేడిపల్లి, ప్రజాస్ఫూర్తి : మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీర్జాదిగూడ డివిజన్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రజా పర్యటన నిర్వహించారు. మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని పీర్జాదిగూడ ఓల్డ్ విలేజ్ గుట్ట, డబుల్ బెడ్రూమ్ సముదాయం ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా కాలనీవాసులు తీవ్ర తాగునీటి సమస్యను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. వారానికి ఒకటి లేదా రెండు సార్లు మాత్రమే నీరు వస్తోందని, వచ్చినా తక్కువ ఒత్తిడితో సరఫరా కావడంతో అవసరాలకు సరిపోవడం లేదని మహిళలు వాపోయారు. చాలామంది తాగునీటి కోసం ప్రైవేట్ ట్యాంకర్లపై ఆధారపడాల్సి వస్తోందని, దీంతో అదనపు ఆర్థిక భారం పడుతోందని తెలిపారు. అలాగే కొన్ని గల్లీలలో రోడ్డు నిర్మాణం, డ్రైనేజి సమస్యలతో పాటు రోడ్ల మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని వెంటనే తొలగించాలని స్థానికులు కోరారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు బిల్లులు రాక నిలిచిపోయాయని అప్పులు తెచ్చి అద్దె కట్టుకునే పరిస్థితి వచ్చిందని పలువురు తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ గతంలో కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి నల్లా కనెక్షన్లు కల్పించి స్వచ్ఛమైన తాగునీటిని అందించేలా చర్యలు చేపట్టిందని గుర్తు చేశారు. పీర్జాదిగూడ గుట్టపై సుమారు 50 లక్షల లీటర్ల సామర్థ్యంతో భారీ నీటి రిజర్వాయర్‌ను నిర్మించి భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని మౌలిక వసతులు కల్పించినప్పటికీ, ప్రస్తుతం ప్రజలకు సక్రమంగా నీటి సరఫరా అందకపోవడం బాధాకరమని అన్నారు. ఇంతటి మౌలిక సదుపాయాలు ఉన్నప్పటికీ ప్రజలు మంచినీటి కోసం ఇబ్బందులు పడాల్సి రావడం సంబంధిత అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన విమర్శించారు. వెంటనే నీటి సరఫరా వ్యవస్థలో ఉన్న లోపాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని, ప్రతి ఇంటికి క్రమం తప్పకుండా స్వచ్ఛమైన తాగునీరు అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, దొంతిరి హరిశంకర్ రెడ్డి, సీనియర్ నాయకులు లేతాకుల రఘుపతి రెడ్డి, మహిళా అధ్యక్షురాలు నిర్మల, మైనార్టీ అధ్యక్షులు జిలాని పాషా, ఆకుల మధుకర్, శ్యామాల శ్రీనివాస్, శ్రీకాంత్, కౌడే సాయి శరత్, బాలరాజు, కోనేటి వెంకట్, యాసారం శ్రీనివాస్, మునికుంట్ల కిరణ్ గౌడ్, గడీల జగన్ రెడ్డి, అశోక్ రెడ్డి, సాగర్ రెడ్డి, జమీల్, పన్నబాయ్, గోపాల్ రెడ్డి, పాశం నరేందర్ రెడ్డి, సురేష్, పుల్ల శ్రీనివాస్, వెంకట్, వేంకటరమణ తదితరులు కలిసి పాల్గొన్నారు.



# మహిళా మండల సమాఖ్యలకు 12 బస్సుల కేటాయింపు

* **జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.**

జనగామ, ప్రజాస్ఫూర్తి : హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో 9వ తేదిన రాష్ట్ర ముఖ్య మంత్రి మహిళా మండల సమాఖ్యలకు బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యం లో జిల్లా నుంచి పాల్గొనే మహిళా సంఘాల సభ్యుల రవాణా ఏర్పాట్ల పై జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ బెన్ షా లోమ్ తోకలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష లో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా లోని 12 మండల సమాఖ్యలకు బస్సులు కేటాయించినట్లు తెలిపారు. మహిళ లు సకాలంలో కార్యక్రమ స్థలానికి చేరుకునే లా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి బస్సులో తాగునీరు, అరటి పళ్లు, ప్రథమ చికిత్స కిట్లు అందు బాటులో ఉంచాలని, ఏపీ ఎం, సీ.సీ, ఆశా, ఏఎన్‌ఎం, పోలీసు సిబ్బంది తప్ప నిసరిగా ప్రయాణించాలన్నారు. మహిళలు మధ్యాహ్నం 2 గం టల వరకు పరేడ్ గ్రౌండ్స్ లో ఉండేలా రవాణా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అలాగే రైతు సేవా కేంద్రాల నిర్వహణను సమర్ధ వంతంగా చేపట్టాలని మ హిళా సంఘాల సభ్యులకు సూచించిన కలెక్టర్, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కుట్టిన యూని ఫాంలు సరైన కొలతల్లో ఉన్నాయో లే వో పరిశీలించాలని తెలిపారు. అవసరమైతే సవరణలు చేసి ప్రతి విద్యార్థికి సరైన పరిమాణంలో యూనిఫాం అందే లా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్డీ ఓ భాస్కర్, ఏపీడీ నూరుద్దీన్, విద్యా శాఖ అధికారులు, మండల సమాఖ్య మహిళలు తదితరులు పాల్గొన్నారు.


# యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

: **సీఐ సత్యనారాయణ రెడ్డి.**



జనగామ, ప్రజాస్ఫూర్తి : యువత మద్యం, గంజాయి,మత్తు పదార్థాలు, ఆన్ లైన్ బెట్టింగ్ లాంటి చెడు వ్యసనా లకు బానిస కాకుండా తమ భవిష్యత్తు పై దృష్టి సారించాలని సీ.ఐ సత్యనారాయణ రెడ్డి సూచించారు. ఆదివారం ఏసీ రెడ్డి నగర్ కాలనీ లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతి థి గా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, యువత విద్య, క్రీడలు,సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని కొరారు. మత్తు పదార్థాల వినియోగం ఆరోగ్యం, కుటుంబం, సమాజం పై ప్రతి కూల ప్రభావం చూపుతుందన్నారు. తల్లిదండ్రులు పిల్లలను గమనిస్తూ సరైన మార్గ నిర్దేశనం చేయాలని, మత్తు పదా ర్థాల విక్రయాలు లేదా అనుమానస్పద కార్యకలాపాల పై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియ జేయాల ని సూచించారు. యువత ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకుని చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కా లనీ ప్రతినిధులు,విద్యార్థులు,యువత,ఉపధ్యాయులు,స్థానిక ప్రజలు,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# కబడ్డీకి కొత్త ఊపు.. భూపాలపల్లిలో మ్యాట్ ప్రారంభం



జయశంకర్ భూపాలపల్లి జిల్లా , ప్రజాస్ఫూర్తి: జిల్లాలో క్రీడల అభివృద్ధికి మరో అడుగు పడింది. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన కబడ్డీ మ్యాట్‌ను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కబడ్డీ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించి, క్రీడాకారులతో కలిసి కొంతసేపు ఆటలో పాల్గొని వారిలో ఉత్సాహాన్ని నింపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలు యువతలో శారీరక దృఢత్వాన్ని పెంపొందించడమే కాకుండా క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలను పెంచుతాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసి ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. జిల్లాలో క్రీడల అభివృద్ధికి అవసరమైన సదుపాయాలను మరింత విస్తరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. యువత క్రీడలను సద్వినియోగం చేసుకొని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్, భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్, యువజన సర్వీసుల శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు, యువకులు పాల్గొన్నారు.

# ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ గా రమేష్



ప్రజాస్ఫూర్తి , జన్నారం : జన్నారం ఐటిఐ, ఏటిసి ఇన్చార్జి ప్రిన్సిపల్ గా వై రమేష్ ను ఉన్నత అధికారులు నియమించారు. ఇప్పటివరకు ఇన్చార్జి ప్రిన్సిపల్ గా బాధ్యతలు నిర్వర్తించిన రాములును సిరిసిల్ల ఐటిఐ కళాశాలకు బదిలీ చేయగా, ఆయన స్థానంలో మంచిర్యాల ఐటిఐలో ట్రైనింగ్ ఆఫీసర్, ఇన్చార్జి ప్రిన్సిపల్ గా విధులు నిర్వహిస్తున్న వై.రమేష్ ను జన్నారం ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ గా నియమించారు. ఈ సందర్భంగా నూతన ప్రిన్సిపల్ వై రమేష్ మాట్లాడుతూ అధ్యాపకులు సిబ్బంది సహకారంతో విద్యార్థులను తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని తెలిపారు.

# భూపాలపల్లిలో భారీగా గుట్కా స్వాధీనం

* **రూ.1.92 లక్షల విలువైన 1,200 అంబర్ గుట్కా ప్యాకెట్లు పట్టివేత**
* **ఒకరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు**




జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : భూపాలపల్లి జిల్లాలో నిషేధిత పొగాకు ఉత్పత్తుల విక్రయాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు సీసీఎస్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో భారీ మొత్తంలో అంబర్ (అనార్ బ్రాండ్) గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. భూపాలపల్లి మండలం ఖాసింపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ యూసుఫ్ (36) అక్రమంగా నిల్వ ఉంచిన గుట్కాను పోలీసులు గుర్తించారు. తనిఖీల సందర్భంగా ఆరు సంచుల్లో దాచిపెట్టిన మొత్తం 1,200 గుట్కా ప్యాకెట్లు లభించాయి. వీటి మార్కెట్ విలువ సుమారు రూ.1.92 లక్షలుగా అధికారులు అంచనా వేశారు. స్వాధీనం చేసుకున్న గుట్కా నమూనాలపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అభిప్రాయం తీసుకున్న అనంతరం, నిందితుడిని మరియు గుట్కా ప్యాకెట్లను తదుపరి చట్టపరమైన చర్యల కోసం భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. నిషేధిత పొగాకు ఉత్పత్తుల నిల్వ, రవాణా, విక్రయాలు చట్టరీత్యా నేరమని పోలీసులు స్పష్టం చేశారు. జిల్లాలో ఇటువంటి అక్రమ కార్యకలాపాలపై నిరంతర నిఘా కొనసాగుతుందని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## రాక్ ఇన్ లగ్జరీ రూమ్స్ హోటల్ ప్రారంభించిన బుర్రి శ్రీనివాస్ రెడ్డి, గుమ్మల



నల్గొండ , ప్రజాస్ఫూర్తి : నల్గొండ నగరంలోని పానగల్లు ఫ్లైఓవర్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన రాక్ ఇన్ లక్సరీ రూమ్స్ హోటల్ను ఆదివారం నల్లగొండ మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. నల్గొండ కార్పొరేషన్ లో స్మార్ట్ సిటీలో భాగంగా అదునాతనమైన హోటల్స్ అందుబాటులోకి రావడం అభివృద్ధికి సూచిక అన్నారు. ఆహ్లాదకర వాతావరణంలో ఇటువంటి సౌకర్యవంతమైన లగ్జరీ రూమ్స్, పట్టణ వాసులకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఈ సందర్భంగా వారిని సెలవులతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్, హోటల్ చైర్మన్ నరేందర్, మాజీ కౌన్సిలర్ కయుం బెగ్, రఫీ, పాశం సంపత్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## చేసిన మంచి పనులే, ప్రజలలో చిరస్థాయిగా నిలుపుతాయి



ప్రజాస్ఫూర్తి , జన్నారం : పదవిలో ఉన్నప్పుడు ప్రజలకు చేసిన సేవలు మంచి పనులే బదిలీపై వెళ్లిన తర్వాత కూడా చిరస్థాయిగా ఆ పనులు నిలుస్తాయని, తిమ్మాపూర్ గ్రామ సర్పంచ్ గుగులావత్ సంగీత రవి నాయక్, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షులు జాడి గంగాధర్ అన్నారు. ఆదివారం జన్నారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామపంచాయతీ కార్యదర్శిగా, ఏడు సంవత్సరాలు విధులు నిర్వహించి, బదిలీపై దండపల్లి మండలం అల్లీపూర్ గ్రామ కార్యదర్శిగా బదిలీపై వెళ్లిన మేక లావణ్య కు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ మేక లావణ్య కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడపడానికి కృషి చేశారన్నారు. ఏడు సంవత్సరాల తమ విధులలో ఎన్నడు కూడా వివాదాలు లేకుండా తమ పాలనను సాగించారన్నారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ, గ్రామాన్ని అభివృద్ధి చేయడంలో గ్రామ ప్రజలు పాలకవర్గ సభ్యుల సహకారం ఎంతో అందించారన్నారు.వారు అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. జాడి గంగాధర్ సర్పంచ్ గా ఉన్న సమయంలో, తను కొత్తగా కార్యదర్శిగా విధుల్లోకి చేరానన్నారు. ఆ కాలంలో తనకు ఎన్నో పనులు నేర్పిస్తూ, ప్రభుత్వ జీవోలో ప్రకారం ఎలా మెలగాలో, ప్రజల్లో ఎలా ఉండాలో, అభివృద్ధి ఎలా చేయాలో, తమకు క్షుణ్ణంగా వివరిస్తూ తమను ముందుకు నడిపించారన్నారు. తిమ్మాపూర్ గ్రామంలో తమ మొట్టమొదటి పోస్టింగ్ కావడంతో ఇక్కడే ఎన్నో కొత్త అనుభవాలు నేర్చుకున్నామన్నారు.. గ్రామస్తులు ఎంతో సహకరించారన్నారు. తిమ్మాపూర్, సర్పంచ్ గా జాడి గంగాధర్, ఉప సర్పంచ్ వార్డు సభ్యులంతా కలిసి తమకు ఎంతో సహకరించాన్నారు. అలాగే కొత్తగా ఎన్నికైన నూతన పాలకవర్గ సభ్యులు కూడా ఆరు నెలల నుంచి తమకు సహకరించారన్నారు.

## యాదాద్రి భువనగిరి జిల్లా ఉప సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షునిగా సుర్కంటి శ్రీధర్ రెడ్డి



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: యాదాద్రి భువనగిరి జిల్లా ఉప సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షునిగా ఉప్పల్ మండలం మందోళ్ళగూడెం గ్రామ ఉప సర్పంచ్ సుర్కంటి శ్రీధర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బొట్ల కార్తీక్ చేతుల మీదుగా నియామకపు ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా నూతన ఉప సర్పంచ్ల ఫోరం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు సుర్కంటి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉప సర్పంచ్‌ల సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల పరిరక్షణకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన ఉప సర్పంచ్‌లందరికీ పేరుపేరునా ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## చెట్టుపై నుండి పడి గీత కార్మికునికి తీవ్ర గాయాలు



ప్రజాస్ఫూర్తి, జన్నారం : జన్నారం మండలం ఇంధన్ పల్లి గ్రామంలో శనివారం సాయంత్రం ఈత చెట్టు ఎక్కి కల్లు గీసే క్రమంలో మోకుజారడంతో గాజుల నారాయణ గౌడ్ అనే గీత కార్మికుడు క్రింద పడి పోవడం వల్ల తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అక్కడ ఉన్న తోటి గీతా కార్మికులు జన్నారం మండల కేంద్రంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్సలు చేసిన అనంతరం మంచిర్యాల ఆసుపత్రికి తరలించగా పరీక్షలు నిర్వహించిన వైద్యులు నారాయణ గౌడ్ రెండు చేతులు మణికట్టు వద్ద విరిగినట్లు ధ్రువీకరించారు. పేద కుటుంబానికి చెందిన నారాయణ గౌడ్ కు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని జన్నారం మండల గౌడ సంఘం అధ్యక్షులు మూల భాస్కర్ గౌడ్, ఉపాధ్యక్షులు మూల నారాయణ గౌడ్ లు కోరారు.

## భూపాలపల్లిలో టీఆర్ఎస్ జెండా పండుగ

* **'పంచజన్యం' హామీలను ప్రజల్లోకి తీసుకెళ్తాం: నాయకులు**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) ఆధ్వర్యంలో ఆదివారం జెండా పండుగ ఉత్సాహంగా నిర్వహించారు. పార్టీ జిల్లా ఇన్‌చార్జి నరేష్ నేత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర అబ్జర్వర్ మేడల అభిలాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆశయాలు, ఆకాంక్షల సాధనే పార్టీ ప్రధాన లక్ష్యమన్నారు. పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత ప్రకటించిన 'పంచజన్యం' హామీలను ప్రతి ఇంటికి చేరవేసి ప్రజల్లో చైతన్యం తీసుకువస్తామని తెలిపారు. ఉచిత విద్య, ఉచిత వైద్యం, యువతకు ఉపాధి అవకాశాలు, రైతుల అభివృద్ధి, సామాజిక న్యాయం వంటి అంశాల అమలుకు పార్టీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అబ్జర్వర్ వల్లకొండ అజయ్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు సిద్ధిక్ షేక్, బుర్ర వినోద్, గోవర్ధన్, సంతోష్, ఉద్యమ నాయకురాళ్లు భారతమ్మ, పద్మలత, యువజన, విద్యార్థి నాయకులు, హెచ్ఎంఎస్ యూనియన్ ప్రతినిధులు, మహిళలు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ పనులు ప్రారంభమయ్యేనా

* **నెలలు గడుస్తున్నా ప్రారంభం కాని పనులు.**
* **సమస్యలతో విద్యార్థులకు స్వాగతం పలకనున్న పాఠశాలలు.**




హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి విద్యార్థులకు సమస్యలతో స్వాగతం పలికేందుకు సిద్ధమయ్యాయి.హుస్నాబాద్ మండలం వంగరామయ్య పల్లి గ్రామపంచాయతీలో గల పూల్ నాయక్ తండా ప్రాథమిక పాఠశాల పరిస్థితి సమస్యల వలయంలో ఉంది.అధికారుల నిర్లక్ష్యమా? లేదా గ్రామపంచాయతీ పాలకవర్గం నిర్లక్ష్యమా?ఎటు తేలక పాఠశాల చుట్టూ నిర్మించవలసిన ప్రహరీ గోడ పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో పాఠశాలకు వచ్చే విద్యార్థులకు సమస్యలతో స్వాగతం పలికే అవకాశం కల్పించినట్లు అయింది.పాఠశాల ప్రహరీ గోడ పనులు గత ఐదు నెలల క్రితం ఆర్భాటంతో గ్రామపంచాయతీ పాలకవర్గం ప్రారంభించి అర్ధాంతరంగా వదిలేయడంతో ఇప్పటివరకు ఏ మాత్రం పనిచేయకుండా వదిలేశారు. అటు అధికారులు ఏమాత్రం పట్టించుకోకుండా వేసవి సెలవుల్లో పూర్తి చేయవలసిన పనులను పాఠశాల ప్రారంభం అయ్యేనాటికి కూడా ప్రారంభించకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో చదివే విద్యార్థులకు ఏదైనా జరిగితే ఎవరు బాధ్యులని పాఠశాల ముందు పెద్ద పెద్ద గుంతలు తవ్వి విడిచిపెట్టారని, చిన్న పిల్లలు ఆడుకుంటూ ఏదైనా ప్రమాదం జరిగితే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయంపై పాఠశాల ఉపాధ్యాయులు శివ ప్రసాద్ ను వివరణ అడగగా ఈ పనులు ప్రారంభించి ఐదు నెలలు గడుస్తున్నాయని కానీ వేసవి సెలవుల్లో ప్రహరీ గోడ పనులు పూర్తి చేయాలని ఎన్నిసార్లు పంచాయతీ పాలకవర్గాన్ని విన్నవించిన వారు పట్టించుకోకుండా మాట దాటవేస్తున్నారని, విద్యాశాఖ అధికారులకు సైతం చెప్పానని,ఇవాళ చేపిస్తాం రేపు చేపిస్తామని అనుడే తప్ప దాన్ని ప్రారంభించి వదిలేసారే తప్ప పనులు ప్రారంభించలేదని ఆయన అన్నారు.ఇంకో నాలుగు రోజులు అయితే పాఠశాల ప్రారంభమవుతుందని విద్యార్థులకు పాఠశాల ముందు ఉన్న గుంతలు బండరాళ్లు ప్రాణ సంకటకంగా మారాయని ఉపాధ్యాయుడు శివప్రసాద్ అన్నారు.ఏదేమైనాప్పటికీ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఇప్పటికైనా అధికారులు పాలకవర్గం ప్రత్యేక దృష్టి సారించి ప్రహారి గోడ పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## బండారు శ్రీనివాస్‌ను సన్మానించిన మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: తెలంగాణ ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం (టీపీటీఎఫ్) జిల్లా నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన బండారు శ్రీనివాస్‌ను ప్రముఖ విద్యావేత్త కాసర్ల వీరారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కక్కిరేణి శ్రీనివాస్ మాట్లాడుతూ "బండారు శ్రీనివాస్ నాయకత్వంలో టీపీటీఎఫ్ సంఘం మరింత బలోపేతం అవుతుందని నేను గట్టిగా నమ్ముతున్నాను. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సంఘ భవన నిర్మాణం కోసం ఆయన చిత్తశుద్ధితో కృషి చేస్తారని ఆకాంక్షిస్తున్నాను. ఉపాధ్యాయ వర్గం సంక్షేమే లక్ష్యంగా ఆయన పనిచేయాలని కోరుకుంటున్నాను" అని అన్నారు. అనంతరం బండారు శ్రీనివాస్ మాట్లాడుతూ "సంఘ నిర్మాణం కోసం నా వంతు పాత్రను పూర్తి నిబద్ధతతో పోషిస్తాను. టీపీటీఎఫ్ సంఘ భవన నిర్మాణానికి నా వంతు సహకారం అందించడమే కాకుండా, సంఘ సభ్యులందరి సహకారంతో ఈ కార్యాన్ని త్వరగా పూర్తి చేస్తానన్నారు. మీ అందరి మద్దతుతో సంఘాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడానికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, సామాజిక సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న సంఘ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన అధ్యక్షుడు బండారు శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయ సమస్యలపై సమిష్టిగా పోరాడి పరిష్కారం సాధిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో వార్డ్ సభ్యులు రమేష్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, రమణ, వీరయ్య, కృష్ణంరాజు, పిన్నెల్లి వెంకటేష్, ప్రభాకర్, రమేష్, అశోక్, రేవన్ తదితరులు పాల్గొన్నారు.

## దేశ సేవ చేసే భాగ్యం దక్కడం గర్వకారణం

* **సమ్మిగౌడ్ చిలువేరు**



కేసముద్రం, మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : పేదరికం చదువుకు అడ్డంకి కాదని, పట్టుదల ఉంటే ఎంతటి ఉన్నత శిఖరాన్నైనా అధిరోహించవచ్చని నిరూపించారు. ఆ యువకుడు. కేసముద్రం మండల, కేంద్రంలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన చింతకుంట్ల చరణ్ కుమార్ అతి చిన్న వయసులోనే సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) ఉద్యోగం సాధించి, తన కుటుంబానికి, గ్రామానికి తీరని కీర్తిని తీసుకువచ్చాడు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన చరణ్ కుమార్ ఉద్యోగం సాధించిన అనంతరం, ప్రముఖ సామాజిక నాయకులు సమ్మిగౌడ్ చిలువేరును మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదాలు తీసుకున్నారు.

* **స్వయంకృషితో సాధించిన విజయం యువతకు ఆదర్శం**

చరణ్ కుమార్ తండ్రి చింతకుంట్ల ముత్తయ్య తాపీ మేస్త్రిగా తల్లి పుష్పలత ఆశా వర్కర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఎంతో సాధారణ కుటుంబం నుంచి వచ్చిన చరణ్ కుమార్, నిత్య జీవితంలో ఎన్నో సవాళ్లను అధిగమించి స్వయంకృషితో ఈ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించడం విశేషం.ఈ సందర్భంగా సమ్మిగౌడ్ మాట్లాడుతూ.. "పేద కుటుంబంలో పుట్టి, ఎన్నో కష్టాలను ఓర్చి దేశ సేవ చేసే స్థాయికి చేరుకోవడం చాలా గొప్ప విషయం. చరణ్ కుమార్ సాధించిన ఈ విజయం గ్రామంలోని ఎంతోమంది యువతకు స్ఫూర్తినిస్తుంది" అని కొనియాడారు.పెద్ద దిక్కుగా నిలిచిన సమ్మిగౌడ్ గత ఎన్నో సంవత్సరాలుగా ఆశా వర్కర్ల సమస్యలపై నిరంతరం పోరాడుతూ, వారికి అండగా నిలుస్తున్న సమ్మిగౌడ్ పట్ల చరణ్ కుటుంబ సభ్యులు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తమ కుటుంబానికి కూడా పెద్ద దిక్కుగా ఉంటూ, అనేక సందర్భాల్లో చరణ్ విద్యాభ్యాసంపై, భవిష్యత్తుపై ఎప్పటికప్పుడు ప్రోత్సాహం అందించారని వారు భావోద్వేగంతో గుర్తు చేసుకున్నారు.

## రౌడీ షీటర్లు శాంతి భద్రతలకు భంగం కలిగించవద్దు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శభరిష్. ఆదేశాల మేరకు టౌన్ డీఎస్పీ తిరుపతి రావు సూచనల ప్రకారం టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలువురు రౌడీ షీటర్లకు ఆదివారం మహబూబాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ రఘుపతి రెడ్డి కౌన్సిలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా రౌడీ షీటర్లను ఉద్దేశించి మాట్లాడుతూ చట్టానికి విరుద్ధమైన కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, సమాజంలో శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడవద్దని, గౌరవప్రదమైన జీవితం జీవించాలని సూచించారు.రౌడీ షీట్ ఉన్న వ్యక్తుల కదలికలపై పోలీసు శాఖ నిరంతరం నిఘా ఉంచుతుందని, భవిష్యత్తులో ఏవైనా నేరాలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు శాఖకు సహకరించాలని, అనుమానాస్పద వ్యక్తుల గురించి స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

# బహిర్ భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి



ప్రజాస్ఫూర్తి , జన్నారం : బహిర్ భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి చనిపోయిన ఘటన మండలంలోని చింతగూడ గ్రామంలో చోటు చేసుకుంది.ఎస్.ఐ గుర్రం ఉదయ్ కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం జన్నారం మండలంలోని చింతగూడ గ్రామానికి చెందిన గజ్జెల భూపతి(30) వారి దగ్గర పనిచేసే చక్రం లచ్చు తో కలిసి ఆదివారం ఉదయం ఏడు గంటలకు కవులు చేస్తున్న చింతగూడ గ్రామ శివారులోని ఆకుల నాగన్న భూమిలో గల మొక్కజొన్న పంట వ్యర్థాలను తొలగించడానికి వెళ్లారు.గజ్జెల భూపతి బహిర్భూమికి వెళ్లి పక్కనే ఉన్న బియ్యాల మల్లేష్ భూమిలో గల వ్యవసాయ బావి వద్దకు వెళ్లి కడుక్కునే సమయంలో ప్రమాదవశాత్తు బావిలో పడి నీట మునిగి చనిపోయాడని మృతుడి తండ్రి మల్లేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉదయ్ కిరణ్ తెలిపారు.మృతుడికి వివాహమై సంవత్సరం కాగా,ప్రస్తుతం మృతుడి భార్య గర్భిణీ. ఈ విషాద ఘటనతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది,భార్య, కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

# నెత్తి మీద గ్యాస్ బుడ్డితో మున్సిపల్ చైర్మన్ నిరసన


* **పెరిగిన వంట గ్యాస్ ధరలను తగ్గించాలంటూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ధర్నా.**



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : హుస్నాబాద్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిరసన కార్యక్రమం ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి వినూత్నంగా గ్యాస్ బండను నెత్తిమీద పెట్టుకుని నిరసన తెలిపారు అనంతరం అక్కన్నపేట చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం ముందు కట్టెల పొయ్యి పెట్టి కాంగ్రెస్ పార్టీ శ్రేణులంతా ధర్నాకు దిగారు కేంద్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల పట్ల పెరిగిన వంటగ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ ధర్నాకు దిగారు.సామాన్యుని నడ్డి విరుస్తున్న కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా నినాదాలు చేశారు అనంతరం మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి మాట్లాడుతూ ఇప్పటికే నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని సామాన్యుడు నిత్యావసర వస్తువులను కొనలేని పరిస్థితిలో ఉన్నాడని అంతలోనే కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ వంటగ్యాస్ ధరలను పెంచి సామాన్యుని నడ్డి విరుస్తున్నారని ఆమె అన్నారు.కేంద్ర ప్రభుత్వం వెంటనే పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని లేనిచో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు..

* **108 సిబ్బంది చాకచక్యంతో తప్పిన ప్రాణాపాయం.**



స్టేషన్ ఘన్‌పూర్, ప్రజాస్ఫూర్తి : జిల్లా లోని చిల్పూర్ మండలం చిన్న పెండ్యా ల సమీపంలో జరిగి న రోడ్డు ప్రమాదం లో చాగల్లు గ్రామానికి చెందిన గాండ్ల రమేష్ తీవ్రంగా గాయపడ్డాడు. చాగల్లు నుంచి రాంపూర్ ఇండస్ట్రీకి హమాలి పనికి బైక్ పై వెళ్తుండగా ప్రమాదవశా త్తు బైక్ స్కిడ్ కావ డంతో రమేష్ కింద పడిపోయాడు. ఈ ఘటనలో అతనికి తల, చేతులకు తీవ్ర గాయాలు కావడం తో పాటు అధిక రక్తస్రావం జరిగింది. స మాచారం అందు కున్న 108 స్టేషన్ ఘ న్‌పూర్ అంబులెన్స్ సిబ్బంది ఈ.ఎం.టి హరికృష్ణ, పైలెట్ రాజన్న వెంటనే ఘట నాస్థలికి చేరుకొని ప్రాథమిక చికిత్సఅం దించారు. అనంతరం అంబులెన్స్ లో అత్యవసర వైద్యం కొనసాగిస్తూ వరం గల్ ఎం.జీ.ఎం ఆసుపత్రికి తరలించా రు. ప్రస్తుతం రమేష్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

# రాష్ట్రంలో ఏ ఎన్నికలు వచ్చినా గెలిచేది కాంగ్రెస్సే : ఆది శ్రీనివాస్



హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాదని కవిత అంటున్నారని, కానీ.. రాష్ట్రంలో ఏ ఎన్నికలు వచ్చినా తామే గెలుస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పవన్ కల్యాణ్‌కు సంబంధించిన భూములపై కవిత దగ్గర ఆధారాలుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని, ఆ మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. హైడ్రా ద్వారా రూ.50 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కాపాడామని తెలిపారు. ''బీఆర్ఎస్ ప్రభుత్వం భూ కబ్జాలకు ద్వారాలు తెరిచి అవినీతి చేసింది. వాటిపై కవిత మాట్లాడాలి. కేటీఆర్, హరీశ్ రావు భూ కబ్జాలకు పాల్పడి బినామీల పేరిట వాటిని మార్చిన విషయం ఆమెకు తెలుసు. టీఆర్ఎస్‌కు ప్రజల్లో ఆదరణ లేకపోవడంతోనే అసత్య ఆరోపణలు చేస్తూ కాలం వెల్లదీస్తున్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురైనట్లు ఆధారాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలి'' అని ఆది శ్రీనివాస్ చెప్పారు.

# విజయవంతంగా ముగిసిన ఆర్చరీ సమ్మర్ శిక్షణ క్యాంపు





మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : శ్రీ సాదుల ముత్తయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్చరీ సమ్మర్ శిక్షణ శిబిరం గత 45 రోజుల నుండి ఉదయం రెండు గంటలు, సాయంత్రం రెండు గంటలు విద్యార్థులకు వేసవికాలంలో షూటింగ్ ఆర్చరీ శిక్షణ విజయవంతంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీ సాదుల ముత్తయ్య చారిటబుల్ ట్రస్ట్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు సాదుల సారంగపాణి, ఖమ్మం జిల్లా ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి పుట్ట శంకరయ్య పాల్గొన్నారు. సాదుల సారంగపాణి మాట్లాడుతూ వేసవికాలంలో విద్యార్థులకు సెలవులు దినాల్లో ఇంటిదగ్గర టీవీలకు, మొబైల్ ఫోన్లకు ఎడిట్ అయి తమ భవిష్యత్తుని పాడు చేసుకుంటున్నారు. వేసవికాలంలో ఈతకు వెళ్లి ప్రాణాలు కూడా పోగొట్టుకున్న సందర్భాలు ఉన్నాయి ఇలాంటి సమయంలో విద్యార్థులకు వామప్, మానసికంగా ఆటలతో వారి నైపుణ్యాన్ని వెలికి తీసే ఉద్దేశంతో వేసవికాలంలో శ్రీ సాదుల ముత్తయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్చరీ సమ్మర్ క్యాంపు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమ్మర్ క్యాంపులో సుమారుగా 350 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సాదుల సారంగపాణి చేతుల మీదుగా విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రధానం చేయడం జరిగింది.మునుముందు విద్యార్థులు ఆటలతో తమ బంగారు భవిష్యత్తుని ఏర్పాటు చేసుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆర్చరీ నైపుణ్యం వల్ల మంచి భవిష్యత్తు భారత దేశంలో ఉంటుందని ఉద్యోగాలలో కూడా స్పోర్ట్స్ సర్టిఫికెట్ చాలా అవసరం పడుతుంది. ఈ సందర్భంగా వారన్నారు. ఈ కార్యక్రమంలో ఈనాడు విలేఖరి రామనర్సయ్య, ప్రజాస్ఫూర్తి విలేకరి మహబూబాబాద్ జిల్లా స్టాపర్ అంబాల కుమార్, సూపర్వైజర్ మార్కండేయ కోచ్ పాయం లక్ష్మణ్, వెంకట యాదవ్ నరేష్, దస్తగిరి, విద్యార్థులు,తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రపంచ సాహిత్య మహాసభల్లో ఉత్తమ కవిత అవార్డు



నెల్లికుదురు, మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : అంతర్జాతీయ స్థాయిలో జరిగిన ప్రతిష్టాత్మకమైన 7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల్లో మహబూబాబాద్ జిల్లాకు అరుదైన గౌరవం దక్కింది. నెల్లికుదురు మండలం, రాజులకొత్తపల్లి గ్రామానికి చెందిన యువ కవి వరిపల్లి అనిల్ కుమార్ అంతర్జాతీయ వేదికపై తన ప్రతిభను చాటి 'ఉత్తమ కవిత అవార్డు' కైవసం చేసుకున్నారు. ప్రపంచంలోని వివిధ దేశాల నుంచే కాకుండా, భారతదేశం నలుమూలల నుండి ప్రముఖ కవులు, రచయితలు, పరిశోధకులు, సాహితీవేత్తలు హాజరైన ఈ మహాసభల్లో అనిల్ కుమార్ రాసిన కవితకువిశిష్ట పురస్కారం లభించింది. శనివారం జరిగిన ఘనమైన సభలో దేశ,విదేశాల సాహితీ దిగ్గజాల సమక్షంలో ఆయనకు ఈ అవార్డుతో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేసి ఘనంగా సన్మానించారు.ఎందరో లబ్ధప్రతిష్టులైన సాహితీవేత్తలు పాల్గొన్న ఈ ప్రపంచ స్థాయి వేదికపై మహబూబాబాద్ జిల్లా, నెల్లికుదురు మండలం, రాజులకొత్తపల్లి గ్రామం పేరును నిలబెట్టడం పట్ల జిల్లా ప్రజలు, సాహితీ అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత అనిల్ కుమార్ మాట్లాడుతూ "ఇంతటి ప్రతిష్టాత్మకమైన ప్రపంచ వేదికపై మన ప్రాంతం పేరును చాటిచెప్పే అవకాశం రావడం నా పూర్వజన్మ సుకృతంగా, నా అదృష్టంగా భావిస్తున్నాను. ఈ ప్రయాణంలో నన్ను ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తూ, నా వెన్నంటి నిలిచిన నా కుటుంబ సభ్యులకు, మిత్రులకు, నా గ్రామ ప్రజలకు , శ్రేయోభిలాషులందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో అవార్డు సాధించి జిల్లా కీర్తి పతాకాన్ని ఎగురవేసిన వరిపల్లి అనిల్ కుమార్‌కు గ్రామ ప్రజలు, మండల ప్రజాప్రతినిధులు, కవులు, పలువురు సాహితీ అభిమానులు సాదరంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.



# విశ్వబ్రాహ్మణులంతా ఐక్యంగా ఉండి ముందుకు సాగాలి

* **తెలంగాణ మహిళా కమిషన్ సభ్యురాలు కాసోజు శంకరమ్మ**

నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : విశ్వబ్రాహ్మణులంతా ఐక్యంగా ఉండి ముందుకు సాగాలని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కాసోజు శంకరమ్మ స్పష్టం చేశారు. తెలంగాణ మహిళా కమిషన్ సభ్యురాలుగానియామకమైన ఆమెను విశ్వబ్రాహ్మణ సేవా సంస్థ నల్గొండ జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఆత్మీయ అభినందన సభకు ఆమె హాజరైనారు. విశ్వకర్మ భగవాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమంలో తొలి అమరుడు తన కుమారుడు దివంగత కాసోజు శ్రీకాంతాచారి సమాజంలో చిరస్మరణుడని తెలిపారు. తెలంగాణ సమాజం ప్రొఫెసర్ జయశంకర్ సార్ ను సైతం మరో వద్దన్నారు. తన కుమారుడు కాసోజు శ్రీకాంతాచారి తెలంగాణలో ప్రజల గుండెల్లో రాష్ట్ర సాధనలో జీవించే ఉన్నారని కన్నీటి పర్యంతమయ్యారు. తనను గౌరవించేలా అభినందన సభ ఏర్పాటు చేసిన సేవా సంస్థకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అద్దంకి లక్ష్మయ్య సన్మాన పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సేవా సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి పెందోట సోము, విశ్వబ్రాహ్మణ సంస్థ సేవ అధ్యక్షుడు దాసోజు యాదగిరి ఆచారి, విశ్వబ్రాహ్మణ సంఘాల నాయకులు కాసోజు విశ్వనాథం, కొల్లోజు సత్యనారాయణ, విశ్వబ్రాహ్మణ విద్యార్థి వసతి గృహము అధ్యక్షుడు కూరెల్ల రమణాచారి , మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు భూముల మోహన్ రెడ్డి , విశ్వబ్రాహ్మణ సేవా సంస్థ కోశాధికారి తరునోజు భీష్మాచార్య, మహిళ కార్యదర్శి పర్వతం శోభారాణి, విశ్రాంత అటవీశాఖ అధికారి ఎన్ వి రఘువీర్ ప్రతాప్, కంచనపల్లి షణ్ముఖ చారి, సేవా సంస్థ గౌరవాధ్యక్షులు శ్రీపాద కృష్ణమాచారి, మాజీ గౌరవ అధ్యక్షులు కొండజు కృష్ణమాచారి, ప్రచార కార్యదర్శి బొడ్డుపల్లి రామకృష్ణ, దాసోజు బ్రహ్మచారి, కటకం వెంకటాచారి, కాసోజు శంకరాచారి, మనుమయ సంఘం పట్టణ మాజీ అధ్యక్షుడు సొల్లేటి రమేష్, చోల్లేటి కొండయ్య, రథం వెంకటరత్నం, పోలోజు శ్రీనివాస చారి, బౌరోజు రాఘవాచారి, సొల్లేటి వెంకటాచారి, ఉమారాణి, కూరెళ్ళ రాఘవాచారి తదితరులు పాల్గొన్నారు.

# మిలిటరీ ఉద్యోగి హత్య

* **కుటుంబ తగాదాలతో తరచూ గొడవలు**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: మిలిటరీ ఉద్యోగి పూంటికూర కుమార్ గౌడ్ (50) దారుణ హత్య కు గురైన సంఘటన మెదక్ పట్టణంలో కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్లే మెదక్ మండలం ర్యాలమడుగు గ్రామానికి చెందిన పుంటికూర కుమార్ గౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి మెదక్ పట్టణంలోని మిలిటరీ కాలనీ లో నివాసం ఉంటున్నారు. ఆయన కు భార్య పద్మ, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.ఈ మేరకు ఆదివారం మృతుడు తన భార్యతో కుటుంబ తగాదాల కారణంగా మరో మహిళతో అక్రమ సంబంధం కలిగి ఉన్నాడని ఆరోపణలపై తరచుగా గొడవలు పడుతుండేవాడు. మెదక్ లోని మిలిటరీ కాలనీలో ఉన్న తన ఇంట్లో అతని భార్య పద్మ ఆమె తల్లిదండ్రులు రామకృష్ణ గౌడ్ మరియు ఎల్లమ్మ ఆమె సోదరుడు సంతోష్ మరియు ఇతర గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో ఆదివారం హత్య కు గురయ్యాడు.ఈ మేరకు మృతదేహాన్ని మెదక్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ కి తరలించారు.హత్య కు సంబంధించిన పూర్తి వివరాలు తెలియలేదని, ఘటన కు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

# భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

**- గోశిక కరుణాకర్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం పార్టీ మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్ డిమాండ్ చేశారు. భవన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆ సంఘం ఆధ్వర్యంలో చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం కొందూరు రోడ్డు చౌరస్తా వద్ద చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం రెండో రోజుకు చేరుకుంది. సమ్మె శిబిరాన్ని సిపిఎం పార్టీ మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్ సందర్శించి, భవన నిర్మాణ కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో నమోదైన కార్మికులకు అందాల్సిన సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాద బీమా, విద్యా సహాయం, ప్రసూతి ప్రయోజనాలు, ప్రతి భవన నిర్మాణ కార్మికులకు 55సంవత్సరాలు నిండిన కార్మికులకు రూ.5వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిర్మాణరంగంలో పనిచేస్తున్న కార్మికులకు ఉపాధి భద్రత కల్పించడంతో పాటు, కనీస వేతనాలను పెంచి అమలు చేయాలని, కార్మికుల కుటుంబాలకు ఆరోగ్య సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వానికి కోరారు. భవన నిర్మాణ కార్మికుల హక్కులను పరిరక్షించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించకుండా, వారి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి ఎండి పాషా, గుణముని రాములు, కలకుంట్ల శివ, నెల్లికంటి నరసింహ, సీమ కండ్ల శ్రీరాములు, మాండారి మార్క్, జాజుల బిక్షపతి, గజ్జల రాజు, ఉబ్బ యాదయ్య, సుక్క యాదయ్య, సువర్ణ, దుర్గం గాలయ్య, ఊదరి రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

# విద్యా, వైద్య రంగ సమస్యల పై దశలవారీ పోరాటాలు

**: ఎండి అబ్బాస్**



జనగామ, ప్రజాస్ఫూర్తి : విద్యా, వైద్య రంగాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సీపీఎం రాష్ట్రవ్యాప్తంగా దశలవారీ ఉద్యమాలు చేపట్టను న్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.డి అబ్బాస్ తెలిపారు. ఆదివారం జిల్లా కార్యాలయం లో రాపర్తి రాజు అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాల లు, కళాశాలల్లో కనీస వసతులు లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, మరోవైపు కార్పొరేట్ విద్యా సంస్థ లు అధిక ఫీజులు వసూలుచేస్తూ తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నాయని విమర్శించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి కనకారెడ్డి, సింగారపు రమేష్, బొట్ల శేఖర్, బూడిద గోపి, జోగు ప్రకాష్, బెల్లంకొండ వెంకటేష్, పుత్కనూరి ఉపేందర్, మునిగల రమేష్, ఎం.డి అజారు ద్దీన్, చిట్యాల సోమన్న తదితరు లు పాల్గొన్నారు.

# కేపీహెచ్‌బీలో పబ్‌పై రైడ్..

# పోలీసుల అదుపులో 9 మంది

హైదరాబాద్: కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ పబ్బులో కూకట్‌పల్లి డీసీపీ ఆధ్వర్యంలో పోలీసులు అర్ధరాత్రి సోదాలు నిర్వహించారు. నిర్ణీత సమయం దాటిన తర్వాత కూడా కింగ్స్ & క్వీన్స్ పబ్బు నిర్వహిస్తున్నట్లు గుర్తించి చర్యలు చేపట్టారు. అక్కడ ఉన్న 9 మందిని అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీసీపీ హెచ్చరించారు.

# ఇండియా కూటమి కీలక సమావేశానికి టీవీకే?

దిల్లీ: భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ఎన్డీయేను ఎదుర్కోవడమే లక్ష్యంగా ఏర్పాటైన ఇండియా కూటమి సోమవారం కీలక సమావేశం కానుంది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కూటమిలోని డీఎంకే ఫ్రంట్ ఓటమి చవిచూసిన వేళ ఈ భేటీ జరుగుతుండడం ప్రాధాన్యం సంతరించుకుంది. భవిష్యత్ వ్యూహాలు, పార్టీల మధ్య సమన్వయం సాధించడమే ఎజెండాగా ఈ సమావేశం జరగనుంది. దేశ రాజధాని దిల్లీలోని కానిస్టిట్యూషనల్ క్లబ్ వేదికగా సోమవారం జరిగే ఈ సమావేశానికి ఇండియా కూటమి నేతలైన రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, తృణమూల్ కాంగ్రెస్ నుంచి మమతా బెనర్జీ, అభిషేక్ బెనర్జీ, సమాజ్‌వాదీ పార్టీ నుంచి అఖిలేశ్ యాదవ్, ఆర్జేడీ నుంచి తేజస్వి యాదవ్,



శివసేన (యూబీటీ) ఉద్ధవ్ ఠాక్రే, వామపక్ష పార్టీ నేతలు పాల్గొననున్నారు. 23 పార్టీలు 'ఇండియా జన్‌బంధన్' సమావేశానికి హాజరుకానున్నాయని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ వెల్లడించారు. విపక్ష పార్టీలన్నీ ఐక్యంగా ఉన్నాయని పేర్కొన్నారు. కొన్ని పార్టీలు అనివార్య కారణాలతో భేటీకి గైర్హాజరవుతున్నప్పటికీ.. మోదీ ప్రభుత్వ విధానాలు, చర్యలను వ్యతిరేకిస్తున్నాయని పేర్కొన్నారు. అయితే, ఈ భేటీకి డీఎంకే, ఆమ్‌ఆద్మీ పార్టీ దూరంగా ఉండే అవకాశం ఉందని తెలిస్తోంది. ఆప్ గత కొన్నాళ్లుగా ఇండియా కూటమి కార్యక్రమాలకు దూరంగా ఉంటుండగా.. తమిళనాడులో టీవీకే కూటమిలో కాంగ్రెస్ చేరడంపై డీఎంకే గుర్రుగా ఉంది. అదే సమయంలో విజయ్ పార్టీ తమిళ వెట్రిగ కళగం (TVK) ఈ భేటీకి హాజరయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. 2024 ఎన్నికలకు ముందు ఇండియా కూటమి ఏర్పాటు కాగా.. అదే ఏడాది జూన్ 1న కీలక సమావేశం జరిగింది. 2025 ఆగస్టు 7న రాహుల్ గాంధీ ఇండియా కూటమి నేతలకు తన నివాసంలో విందు ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఎలాంటి సమావేశాలూ జరగలేదు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల అనంతరం ఇప్పుడు కూటమి భేటీ అవుతోంది.

## నీట్ పరీక్ష.. అందుబాటులోకి
# సిటీ ఇంటిమేషన్ స్లిప్‌లు

నీట్ యూజీ రీఎగ్జామినేషన్‌కు సంబంధించి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కీలక అప్‌డేట్ ఇచ్చింది. అభ్యర్థులకు కేటాయించిన పరీక్షా కేంద్రం ఏ నగరంలో ఉందనే సమాచారాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు ప్రకటించింది. అప్లికేషన్ నంబర్, పాస్‌వర్డ్ సాయంతో లాగిన్ కావడం ద్వారా ఈ వివరాలు పొందవచ్చని తెలిపింది. పేపర్ లీక్ ఆరోపణలతో మే 3న నిర్వహించిన నీట్ యూజీ పరీక్షను ఎన్‌టీఏ రద్దు చేసిన




విషయం తెలిసిందే. జూన్ 21న మరోసారి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈసారి కూడా పెన్‌పేపర్ విధానంలోనే పరీక్ష ఉంటుందని ఇప్పటికే స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా 551 నగరాలు, విదేశాల్లో 14 కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించనున్నారు. మరోవైపు నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై సీబీఐ ప్రస్తుతం దర్యాప్తు కొనసాగిస్తోంది.

# ఆరంకెల జీతం.. వీకెండ్స్‌లో బైక్ ట్యాక్సీ డ్రైవింగ్!

సాధారణంగా ఐటీ ఉద్యోగం అంటేనే రూ.లక్షల్లో జీతం.. విలాసవంతమైన జీవితం.. వారాంతాల్లో పార్టీలు.. సాధారణంగా ఇవే గుర్తొస్తాయి. కానీ, ఇదంతా నాణేనికి ఒకవైపే. ఎంత జీతం వచ్చినా పెద్ద పెద్ద నగరాల్లో జీవన వ్యయం విపరీతంగా పెరిగిపోయింది. దీంతో అదనపు ఆదాయం కోసం కొందరు అదనంగా పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేస్తున్నారు. బెంగళూరుకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కూడా వీకెండ్స్‌లో బైక్ డ్రైవర్ అవతారం ఎత్తాడు. దీనికి సంబంధించి ఓ వ్యక్తి చేసిన పోస్ట్ ప్రస్తుతం వైరల్‌గా మారింది. బెంగళూరులోని బన్నెరఘట్టకు వెళ్లడానికి షాబాజ్ ఇటీవల బైక్ ట్యాక్సీ బుక్



చేసుకున్నాడు. ర్యాపిడో డ్రైవర్‌తో మాటలు కలపగా.. అతడు తొలుత కన్నడలో మాట్లాడాడు. అయితే, షాబాజ్‌కు కన్నడ రాకపోవడం గమనించి వెంటనే ఇంగ్లిష్‌లో సంభాషణను కొనసాగించాడు. 'మీరేం చేస్తుంటారని షాబాజ్‌ని అడగ్గానే.. సాఫ్ట్‌వేర్ ఎంప్లాయీ' అంటూ సమాధానం ఇచ్చాడు. 'మరి మీరు?' అని అడగ్గానే.. 'నేను కూడా' అనే సమాధానం వచ్చింది. 'ఎంఎన్‌సీలో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా పనిచేస్తున్నా. ఆరెంకల జీతం. కానీ, వారం చివరిరోజుల్లో బైక్ ట్యాక్సీ నడుపుతా. నాకు పెళ్లయ్యింది. పిల్లలున్నారు. కుటుంబాన్ని పోషించాలంటే అదనపు ఆదాయం కావాలి కదా!' అంటూ ఆ వ్యక్తి నుంచి సమాధానం వచ్చింది. అతడి మాటలు తనను ఆలోచనలో పడేశాయంటూ షాబాజ్ ఎక్స్ వేదికగా చెప్పుకొచ్చాడు. ఇంత జీతం ఉంటూ ఇలా కష్టపడుతున్నారంటే.. బెంగళూరు వంటి నగరాల్లో జీవించడం ఎంత కష్టంగా మారిందో కదా!' అంటూ పోస్ట్ పెట్టాడు. దీనిపై పలువురు నెటిజన్లు స్పందించారు. హైదరాబాద్ నగరంలోనూ చాలా మంది పరిస్థితి ఇదేనంటూ పేర్కొన్నారు. అదనపు ఆదాయం కోసం ఇలా బైక్ డ్రైవర్‌గా అవతారమెత్తే బదులు.. కొత్త నైపుణ్యాలు నేర్చుకోవడం ద్వారా అధికాదాయం పొందొచ్చంటూ మరికొందరు సలహా ఇచ్చారు.

## అదో మురికి కీటకం..పేరు మార్చుకోండి!
# కాక్రోచ్ పార్టీపై హరియాణా మంత్రి



'కాక్రోచ్ జనతా పార్టీ'పై హరియాణా మంత్రి అనిల్ విజ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ పోరాటం చేసే హక్కు ఉందన్నారు. అయితే, బొద్దింక ఓ మురికి కీటకమని, దాన్ని ఓ చిన్న పిల్లాడు కూడా కాలితో నలిపేయగలడని అన్నారు. అందుకే పేరు మార్చుకోవాలని ఆ పార్టీకి సూచించారు.

**యువత ప్రశ్నించాల్సిందే - అభిజీత్**

పరీక్షల నిర్వహణలో లోపాలకు కారణమైన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను రాజీనామా చేయించే బాధ్యత ప్రధాని మోదీదేనని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. స్వస్థలం శంభాజీనగర్‌లో విలేకరులతో మాట్లాడిన ఆయన.. పేపర్ లీకేజీలపై ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. ఐదేళ్లకు ఓసారి ఓటు వేయడం మాత్రమే రాజకీయం కాదని, ఎవరికి ఓటు వేశామో వారిని ప్రశ్నించాలన్నారు. యువత గళం విప్పినప్పుడే వ్యవస్థ సరిగ్గా పని చేస్తుందన్నారు.

# టీవీకే ప్రభుత్వం మూడు నెలలైనా ఉంటుందా?: స్టాలిన్

తమిళనాడులో టీవీకే ప్రభుత్వం కనీసం మూడు నెలలైనా కొనసాగుతుందా అని ప్రజలు చర్చించుకుంటున్నారని డీఎంకే అధినేత స్టాలిన్ అన్నారు. కొత్త ప్రభుత్వం వచ్చిన కారణంగా 6నెలల వరకు విమర్శలకు దూరంగా ఉందామని అనుకున్నామని.. కానీ రాష్ట్రంలో పరిస్థితి దారుణంగా ఉందని అన్నారు. ఆ గడువు రాకముందే పరిణామాలు మారే విధంగా ఉన్నాయన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడిన నాటి నుంచే డీఎంకే 2026 అసెంబ్లీ ఎన్నికల కోసం క్షేత్ర స్థాయిలో చర్యలు మొదలు పెట్టిందని వెల్లడించారు. బూత్ స్థాయి ఏజెంట్లను నియమించడం, ప్రాంతీయ సమావేశాలు నిర్వహించడం వంటి ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నా అధికారంలోకి రాలేకపోయామని అన్నారు. కానీ కొందరు మాత్రం ఓటర్లను కలవకపోయినా, బూత్ ఏజెంట్లను నియమించకపోయినా గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని స్టాలిన్ అన్నారు. అటువంటి ప్రభుత్వం ఎక్కువ రోజులు ఉంటుందని తాను అనుకోవట్లేదన్నారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించడాన్ని నివారించాలనే ఏకైక ఉద్దేశంతోనే టీవీకేకు మద్దతిచ్చేందుకు తమ కూటమిలోని భాగస్వామ్య పక్షాలను అనుమతించామని పేర్కొన్నారు. అలా చేయకపోతే తమిళనాడులో భాజపా పాలనకు మార్గం




సుగమం అయ్యేదన్నారు. తమ కూటమిలోని పార్టీలు మద్దతు ఇవ్వడం వల్లే ప్రస్తుత ప్రభుత్వం నడుస్తోందన్నారు.

# గర్భిణికి పోషకాహారం పంపిణీ.. ప్యాకెట్‌లో చనిపోయిన పాము పిల్ల

మధ్యప్రదేశ్‌లోని పాంధుర్ణా జిల్లాలో ఊహించని ఘటన చోటుచేసుకుంది. ఓ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణికి పంపిణీ చేసిన పోషకాహార ప్యాకెట్‌లో చనిపోయిన పాము పిల్ల కనిపించడం కలకలం రేపింది. తీవ్ర భయాందోళనకు గురైన ఆమె కుటుంబీకులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. కర్ఘాట్ కామతీ గ్రామానికి చెందిన ఓ గర్భిణి స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో ఇటీవల కొన్ని పోషకాహార ప్యాకెట్‌లు తీసుకున్నారు. తెరచి చూడగా.. ఒకదాంట్లో చనిపోయిన పాము పిల్ల



ఉండటం చూసి అవాక్కయ్యారు. ఈ విషయం తెలిసి భయాందోళనకు గురైన కుటుంబీకులు, గ్రామస్థులతో కలిసి అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి సిబ్బందితోపాటు ఉన్నతాధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే రంగంలోకి దిగిన మహిళా శిశు సంక్షేమాభివృద్ధి శాఖ అధికారులు, పోలీసులు, రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని విచారించారు. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన జిల్లా ఇంఛార్జ్ కలెక్టర్.. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దీనిపై పూర్తి స్థాయి విచారణ కోసం ఐదుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేశారు. ఆహార ప్యాకెట్‌ను స్వాధీనం చేసుకొని నమూనాలను టెస్టింగ్‌కు పంపించామని, నివేదిక వచ్చిన వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.




## కూర్చొని మాట్లాడుకుంటే ఏ సమస్యా పెద్దది కాదు
# నేపాల్ విదేశాంగ మంత్రి

భారత్‌తో సరిహద్దు సమస్యలను దౌత్య చర్చల ద్వారా పరిష్కరించుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు నేపాల్ విదేశాంగ మంత్రి శిశిర్ ఖనాల్ పేర్కొన్నారు. పరస్పర గౌరవంతో కూర్చొని మాట్లాడుకుంటే పరిష్కరించుకోలేని సమస్య అంటూ ఏదీ ఉండబోదన్నారు. ఇరుదేశాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని సరిహద్దు సమస్యలను పరిష్కరించుకోవడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కైలాస మానస సరోవర్ యాత్ర చాలా విభిన్నమైన సరిహద్దు పాయింట్ల ద్వారా జరుగుతోందని పేర్కొన్నారు. పర్యాటకుల్లో చాలా మంది నేపాల్ గుండా ప్రయాణిస్తారని.. కాలాపానీ, లిపులేఖ్ ప్రాంతం ద్వారా భారత్, చైనాల మధ్య ఒప్పందాన్ని పునరుద్ధరించడంపైనే తాము ఆందోళన చెందుతున్నామని అన్నారు. కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్‌తో భేటీ అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. కాలాపానీ, లిపులేఖ్ ప్రాంతంలోని భూమి తమదేనని.. నేపాల్ సమ్మతి లేకుండా ఇరు దేశాలు ఆ ఒప్పందాలను చేసుకోలేవని చాలా కాలంగా చెబుతూనే ఉన్నామని ఆ దేశ విదేశాంగ మంత్రి అన్నారు. ఈ విషయాన్ని మరోసారి భారత విదేశాంగ శాఖ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. కాగితంపై చేసిన పాత వాగ్దానాలకు, క్షేత్రస్థాయిలో నెరవేర్చిన వాస్తవికతకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడమే తమ బాధ్యత అని పేర్కొన్నారు. లిపులేఖ్, లింపియాధురా, కాలాపానీపై నెలకొన్న వివాదంపై నేపాల్ ప్రధాని బాలేంద్ర షా ఇటీవల మాట్లాడుతూ నేపాల్ భూభాగాలను భారత్ ఆక్రమించడమే కాదని, భారత భూభాగాలనూ నేపాల్ ఆక్రమించిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆ దేశ విదేశాంగ మంత్రి సరిహద్దు సమస్యల గురించి వ్యాఖ్యానించడం గమనార్హం. ప్రపంచ వేదికపై వేగంగా ఎదుగుతోన్న భారత్‌తో కలిసి పని చేయడానికి తాము ఎదురు చూస్తున్నట్లు శిశిర్ ఖనాల్ పేర్కొన్నారు. వాణిజ్యం, సరిహద్దు అనుసంధానం, ఇంధన భాగస్వామ్యం, నీటి వనరుల నిర్వహణ వంటి అంశాలపై భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌తో చర్చలు జరిపినట్లు తెలిపారు.

# ఆస్తి కోసమే దిల్లీ ప్రొఫెసర్ హత్య.. దారుణానికి పాల్పడ్డ కిరాయిదారులు

దిల్లీ యూనివర్సిటీ మహిళా ప్రొఫెసర్ దేవోస్మిత పాల్ తన ఫ్లాట్‌లో అనుమానాస్పద స్థితిలో మరణించారు. శుక్రవారం ఈ ఘటన వెలుగులోకి రావడంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు మూడు రోజుల్లోనే కేసును ఛేదించారు. బెంగాల్‌లో ప్రొఫెసర్‌కు ఉన్న ఇంట్లో అద్దెకు ఉంటున్న దంపతులే ఈ దారుణానికి పాల్పడినట్లు వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రొఫెసర్ దేవోస్మిత పాల్‌కు తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన ఆస్తి (ఇల్లు) పశ్చిమ బెంగాల్‌లో ఉంది. దాని విలువ కోట్లలో ఉంటుంది. ఆ ఇంట్లో కొన్నేళ్లుగా స్థానిక దంపతులు అద్దెకు ఉంటున్నారు. దేవోస్మిత భర్త బెంగళూరులో ఉంటుండగా.. దిల్లీలోని సత్యం అపార్ట్‌మెంట్స్‌లోని ఫ్లాట్‌లో ఆమె ఒక్కరే ఉంటున్నారు. కాగా, ఆమె నివాసంలో అద్దెకు ఉంటున్న వారు ఆ ఇంటిని స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు గుర్తించిన దేవోస్మిత ఇల్లు ఖాళీ చేయాలని కొంత కాలంగా వారిపై ఒత్తిడి తెస్తున్నారు. ఎలాగైనా ఆ ఆస్తిని దక్కించుకోవాలనే ఆలోచనతో ఆమెను హత్య చేయడానికి దంపతులు కుట్ర పన్నారు. అందులో భాగంగానే బెంగాల్ నుంచి దిల్లీకి వచ్చారు. బుధవారం దిల్లీకి చేరుకున్న నిందితులు ఎవరూ వారిని గుర్తుపట్టకుండా ముసుగులు ధరించి దేవోస్మిత పాల్ నివాసం వద్దకు వచ్చారు. ఎవరికీ అనుమానం రాకుండా వారితో పాటు తమ బిడ్డను కూడా వెంట తీసుకువచ్చారు. ప్రొఫెసర్ నివసిస్తున్న ఆరో అంతస్తుకు లిఫ్ట్‌కు బదులుగా మెట్ల ద్వారా వెళ్లారు. ఇంట్లోకి ప్రవేశించిన అనంతరం తమతో తెచ్చుకున్న ఆయుధంతో ప్రొఫెసర్‌ను హత్య చేసి..



అక్కడే బట్టలు మార్చుకొని 30నిమిషాల తర్వాత క్యాబ్‌లో తిరిగి వెళ్లిపోయారు. పోలీసులు క్యాబర్ డ్రైవర్‌ను విచారించగా వారు బెంగాల్‌కు చెందిన వారని తెలియడంతో.. ఈ కేసును ఛేదించారు. నిందితులను బెంగాల్‌లోని బర్ధమాన్‌లో అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

# భారత్‌లో జననాల రేటు పడిపోవడంపై.. మస్క్ ఆందోళన

ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశం భారత్‌లో.. సంతానోత్పత్తి రేటు (టీఎఫ్ఆర్) పడిపోతుండటంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై తాజాగా టెస్లా అధినేత ఎలాన్ మస్క్ కూడా స్పందించారు. భారత్‌లో జననాల రేటు రీప్లేస్‌మెంట్ కంటే కిందకు పడిపోతోందని పేర్కొన్నారు. ఇటీవల వెలువడిన గణాంకాల ప్రకారం భారత్‌లో ఫెర్టిలిటీ రేటు గణనీయంగా తగ్గింది. సాధారణంగా ఒక దేశ జనాభా స్థిరంగా ఉండాలంటే సంతానోత్పత్తి రేటు 2.1 కంటే అధికంగా ఉండాలి. అయితే, దేశం మొత్తంలో ఈ టీఎఫ్ఆర్ 2.3 నుంచి 1.9కి పడిపోయింది. ఈ గణాంకాలను ఓ మీడియా ఎక్స్‌లో పోస్టు చేసింది. భారతదేశ చరిత్రలో ఫెర్టిలిటీ రేటు రీప్లేస్‌మెంట్ కంటే కిందకి పడిపోయినట్లు వెల్లడించింది. దీన్ని మస్క్ రీపోస్టు చేశారు. భారత్‌లో జనన రేటు చాలా ఏళ్ల క్రితమే రీప్లేస్‌మెంట్ కంటే కిందకి పడిపోయిందని పేర్కొన్నారు. అత్యంత విద్యావంతులు ఉన్న ఈ దేశంలో ఇలాంటి పరిస్థితి నెలకొనడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ పోస్టు నెట్టింట వైరల్ అవుతోంది.

# మాది బోరింగ్ లవ్‌స్టోరి

**సహజమైన నటనకూ, మహిళా ప్రాధాన్య చిత్రాలకూ కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తుంటుంది జ్యోతిక. చక్కనమ్మ చిక్కినా అందమే అన్నట్లు- కలిన వర్కవుట్లతో నలభైల్లోనూ ఫిట్‌గా కనిపిస్తూ... వరస అవకాశాలను అందిపుచ్చుకుంటోందీ భామ. ఇటీవల వచ్చిన సినిమా 'సిస్టం'లోనూ నటనతో ప్రేక్షకులను మరోసారి ఫిదా చేసిన జ్యోతిక తన గురించి ఏం చెబుతోందంటే...**



### 'వాలి'తో గుర్తింపు

ముంబయిలో పుట్టి పెరిగా. సైకాలజీలో డిగ్రీ చేశా. మా నాన్న చందర్ సాధనా నిర్మాత కావడంతో సులభంగానే హిందీ సినిమా అవకాశం వచ్చింది. కానీ, అది అంతగా ఆడలేదు. ఆ షూటింగ్ చెన్నైలో జరుగుతుండగానే, సూర్య హీరోగా నటిస్తున్న ఓ తమిళ చిత్రానికి సైన్ చేశా. అయితే, దానికంటే ముందు అజిత్‌తో చేసిన 'వాలి' రిలీజైంది. అంతేకాదు... నాకు తొలి సక్సెస్‌ని ఇచ్చిందా చిత్రం. ఆ గుర్తింపే చిరంజీవితో కలిసి 'ఠాగూర్'లో నటించే అవకాశం తెచ్చిపెట్టింది. అది సూపర్‌హిట్ కావడంతో తెలుగులోనూ ఆఫర్లు వరస కట్టాయి.

### ఏడు సినిమాలు చేశాం

సూర్యని మొదటిసారి సినిమా సెట్లోనే చూశా. అప్పుడు నాకు తమిళ్ రాకపోవడంతో తానే దగ్గరుండి ప్రతి డైలాగ్‌నూ వివరించేవాడు. అప్పుడే ఆడవాళ్లకు తానిచ్చే మర్యాద చూసి ముచ్చటేసింది. అలా ఇద్దరం మంచి స్నేహితులమయ్యాం. ఆ తర్వాతా మేమిద్దరం కలిసి మొత్తం ఏడు సినిమాల్లో నటించాం. అలా అలా మా స్నేహం కాస్తా ప్రేమగా మారింది. మొదట మా ప్రేమను సూర్య వాళ్ల నాన్న, నటుడు శివకుమార్‌కు చెబితే ఒప్పుకోలేదాయన. చేసుకుంటే నన్నే చేసుకుంటాననీ, లేకపోతే జీవితాంతం ఒంటరిగానే ఉండిపోతాననీ తను పట్టుబట్టడంతో నెమ్మదిగా అర్థం చేసుకుని సరేనన్నారు.

### ఇద్దరికీ ఇష్టం

సినిమాలూ, పిల్లల చదువుల కోసం నేను ప్రస్తుతం ముంబయిలో ఉంటున్నా. సూర్య మాత్రం ముంబయి టు చెన్నైకి చక్కర్లు కొడుతుంటాడు. నెలకు పది రోజులు షూటింగులు పక్కనపెట్టి పూర్తిగా మాతోనే ఉంటాడు. మా ఇద్దరికీ ముంబయి స్ట్రీట్ ఫుడ్ అంటే బాగా ఇష్టం. అంతా కలిసి తరచుగా టూర్లకూ వెళ్తుంటాం. అక్కడ మమ్మల్నెవరూ గుర్తుపట్టరు కాబట్టి.. షాపింగ్‌కు వెళ్లి బేరాలు ఆడుతుంటాం.

### రూల్‌బుక్ నేనే...

సూర్యా, నేనూ ఇద్దరం ఇంటి బయటే మా స్టార్‌డమ్‌ని వదిలేస్తాం. మా అబ్బాయి దేవ్, అమ్మాయి దియాలతో మేము స్టార్ పేరెంట్స్‌లా కాకుండా సాధారణ తల్లిదండ్రుల్లాగే ఉంటాం. పిల్లల బాధ్యతను ఇద్దరం సమానంగా తీసుకుంటాం. వాళ్ల మార్కులూ, క్రమశిక్షణలాంటి విషయాల్లో నేనే కాస్త కఠినంగా ఉంటా. చదువొక్కటే లోకం కాదని బ్యాడ్మింటన్, కరాటే, పియానో, డాన్స్... ఇలా ఇతర అంశాల్లోనూ పిల్లలకు శిక్షణ ఇప్పించాం.

### బుల్లెట్ బైక్ చూస్తే...

నేను బుల్లెట్ బైక్ నడపడమంటే మా అమ్మాయికి చాలా ఇష్టం. చిన్నప్పుడు తనను బుల్లెట్ బండి మీదే స్కూల్ నుంచి ఇంటికి తీసుకెళ్లమని పోరు పెట్టేది. రెండుమూడుసార్లు వెళ్లి తీసుకొచ్చాను కూడా. ఇప్పటికీ బుల్లెట్ బైక్ చూస్తే నాకు మా అమ్మాయే గుర్తుకొస్తుంటుంది.

### ఏదైనా ఇచ్చిపుచ్చుకుంటేనే...

ఎవరైనా మా లవ్‌స్టోరీ గురించి అడిగితే 'బోరింగ్' అని ఒక్కమాటలో తేల్చేస్తా. స్నేహం, ప్రేమ, పెళ్లి, పిల్లలు.. ఇలా అన్నీ ఒకదాని తర్వాత ఒకటి జరిగిపోయాయి. కాకపోతే... ఏ బంధమైనా గౌరవం ఇచ్చిపుచ్చుకోవడం, అర్థం చేసుకోవడం మీదే ఆధారపడి ఉంటుంది. కొన్నిసార్లు త్యాగాలూ చేయాల్సి వస్తుంది. ఏ ఒక్కరి నుంచి అది లేకపోయినా, జీవితంలో కలిసి ముందుకెళ్లలేరు.



### విద్యాబాలన్ స్ఫూర్తి

ఒకానొక సమయంలో బరువును అదుపులో ఉంచుకోవడం నాకో పెద్ద సమస్యలా మారింది. ఓసారి విద్యాబాలన్ తన వెయిట్ లాస్ జర్నీ గురించి వివరించింది. అది ఫాలో అయ్యి మూడు నెలల్లో తొమ్మిది కిలోలు తగ్గా. ఫైబర్, ప్రొబయోటిక్స్ ఎక్కువగా ఉండే ఐటమ్స్‌తోపాటు పులియబెట్టిన వంటకాలే తిన్నా. ఎక్కడున్నా ప్రతిరోజూ 45 నిమిషాలపాటు కచ్చితంగా వ్యాయామం చేస్తా.

### ఫోన్ లేకపోతే...

'భార్యగా, తల్లిగా, నటిగా మీకెలా టైమ్ సరిపోతుంది?' అని అందరూ అడుగుతుంటారు. ఫోన్ పక్కన పెడితే అన్ని పనులకూ కావాల్సినంత టైం దొరుకుతుందని వాళ్లకు బదులిస్తుంటా. అందుకే సోషల్ మీడియాలోకి చాలా ఆలస్యంగా వచ్చా.




## బుమ్రా తీరు అర్థం కావట్లేదు: మంజ్రేకర్

భారత క్రికెట్ పట్ల స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా నిబద్ధతను మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ ప్రశ్నించాడు. కేవలం తనకు అనుకూలమైన అంతర్జాతీయ మ్యాచ్‌లు మ్యాచ్‌లు మాత్రమే ఆడడానికి ఆసక్తి చూపిస్తున్నాడని.. మిగిలిన వాటికి దూరంగా ఉంటున్నాడని ఆరోపించాడు. కొన్ని మ్యాచ్‌లకు అందుబాటులో ఉంటూ మరికొన్నింటికి విశ్రాంతి తీసుకుంటున్న అతడి విధానంపై ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. పూర్తి స్థాయిలో ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడినప్పటికీ, అంతర్జాతీయ మ్యాచ్‌లు (ఉదాహరణకు ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలు) ఆడేందుకు ఎందుకు వెనుకంజ వేస్తున్నాడనేది అర్థం కావట్లేదని పేర్కొన్నాడు. ఒకవేళ బుమ్రా వరుసగా రెండు టెస్టులు లేదా అంతకంటే ఎక్కువ మ్యాచ్‌లు ఆడలేకపోతే..అతడిని ప్రధాన బౌలర్‌గా పరిగణించకూడదని అభిప్రాయం వ్యక్తం చేశాడు. బుమ్రాకు ఆటపై అద్భుతమైన అవగాహన ఉందని.. అయితే భారత జట్టులో నాయకత్వ బాధ్యతలు తీసుకోవడానికి అతడు అంతగా ఆసక్తి చూపకపోవడం తనను నిరాశపరిచిందని మంజ్రేకర్ పేర్కొన్నాడు. బుమ్రా కోసం భారత క్రికెట్ తన ప్రణాళికలను మార్చుకోదని.. అతడే క్రికెట్ అవసరాలకు తగ్గట్టుగా సమయాన్ని కేటాయించుకొని, మ్యాచ్‌లకు అందుబాటులో ఉండాలని సూచించాడు. క్రికెట్ అనేది ద్వైపాక్షిక సిరీస్‌లు, ప్రపంచ కప్‌ల క్రీడ అని.. ఇందులో కేవలం ఆసియా క్రీడలు, ఒలంపిక్ ప్రదర్శనల వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదని మంజ్రేకర్ అన్నాడు. టెస్ట్ క్రికెట్ కోసం అతడు పడే పనిభారాన్ని తాను అర్థం చేసుకోగలనని.. కానీ మొత్తం ఐపీఎల్‌లో ఆడాడు



కాబట్టి ఐర్లాండ్, ఇంగ్లాండ్‌లలో జరిగే కొన్ని టీ20 మ్యాచ్‌లను కూడా బుమ్రా సమర్థవంతంగా ఆడగలడని అనుకున్నానని పేర్కొన్నాడు. బుమ్రా కోరుకుంటే టెస్టులు, టీ20లకు కెప్టెన్సీ దక్కించుకునేవాడని, అయితే కొన్ని కారణాల వల్ల ఆ కెప్టెన్సీ వరుసగా శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్‌లకు దక్కిందన్నాడు.

## అమెరికా అధికారుల అదుపులో..
## ఇరాక్ ఫుట్‌బాల్ స్ట్రైకర్..!

ఫిఫా ప్రపంచ కప్ మ్యాచ్ కోసం అమెరికాకు వచ్చిన ఇరాక్ స్ట్రైకర్ అయెమెన్ హుస్సేన్ను అక్కడి అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. దాదాపు ఏడు గంటలపాటు విచారించి.. ఆ తర్వాత అతడిని విడుదల చేసినట్లు మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఫిఫా ప్రపంచ కప్‌లో ఈ జట్టు అర్హత సాధించడంలో హుస్సేన్ కీలక పాత్ర పోషించాడు. ఇరాకీ జట్టు అధికార వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం తెల్లవారుజామున హుస్సేన్ తన జట్టుతో కలిసి షికాగోలోని ఓహేర్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నాడు. ఈ క్రమంలో అక్కడి అధికారులు అతడిని అదుపులోకి తీసుకొని.. దాదాపు ఏడు గంటలపాటు విచారించారు. ఆ సమయంలో అతడి ఫోన్‌ను తనిఖీ చేసినట్లు తెలుస్తోంది. చివరికి దేశంలోకి ప్రవేశించేందుకు హుస్సేనీకి అధికారులు అనుమతించారు. ఇదే సమయంలో ఇరాకీ జట్టు తరఫున వచ్చిన ఫొటోగ్రాఫర్ తలాల్ సలాహ్‌ను కూడా అధికారులు 10 గంటలపాటు నిర్బంధించి.. ఫోన్‌ను తనిఖీ చేసినట్లు క్రీడా వర్గాలు తెలిపాయి. అయితే, అతడిని అమెరికాలోకి ప్రవేశించేందుకు నిరాకరించినట్లు వెల్లడించాయి. ఈ ఘటనపై అటు ఇరాకీ ఫుట్ బాల్ అసోసియేషన్ గానీ.. యూఎస్ ఇమిగ్రేషన్ అండ్



కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ గానీ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఇక, ఫిఫా ప్రపంచ కప్2026 మ్యాచ్‌లు జూన్ 11 నుంచి జులై 19 వరకు జరగనున్నాయి. 39 రోజుల పాటు జరిగే ఈ మెగా టోర్నీకి కెనడా, మెక్సికో, యూఎస్‌ఏ ఆతిథ్యం ఇస్తున్నాయి. ఫిఫా వరల్డ్ కప్‌లో గ్రూప్‌ఐలో ఇరాక్ ఉంది. ఈ గ్రూప్‌లోనే ఫ్రాన్స్, సెనెగల్, నార్వే జట్లు ఆడుతున్నాయి.

## వైభవ్ చిన్నోడు.. మీరూ రండి
## అతడి తల్లిదండ్రులకు బీసీసీఐ రిక్వెస్ట్

భారత క్రికెట్ నయా సంచలనం వైభవ్ సూర్యవంశీ కుటుంబానికి బీసీసీఐ నుంచి అరుదైన రిక్వెస్ట్ అందింది. ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలకు అతడితో పాటు రావాలని కోరింది. జాతీయ జట్టులో అతడికి సెలక్టర్లు చోటు కల్పించిన వెంటనే బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఓ అంతర్జాతీయ వార్త సంస్థ కథనం ప్రకారం సూర్యవంశీ బలమైన మద్దతు అతడి తల్లిదండ్రులే అని పేర్కొంది. బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా మాట్లాడుతూ "సూర్యవంశీ తండ్రి రేపు శ్రీలంకకు వెళ్లనున్నారు. అతడి తల్లిదండ్రులు ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లాలనుకొంటే తగిన ఏర్పాట్లు చేస్తాం. అతడికి వారే అత్యుత్తమ మద్దతుదారులు. సాధారణంగా ఆటగాళ్లతోపాటు తల్లిదండ్రులను అనుమతించము. ప్రస్తుతం వైభవ్ ఇండియాఏ జట్టులో ఆడుతున్నాడు. అతడు ఇంకా చిన్నవాడే. అంతా పెద్దలున్న జాతీయ జట్టుతోపాటు ప్రయాణించే వేళ అతడితోపాటు కుటుంబ సభ్యులుండటం సరైన నిర్ణయం అనుకొంటున్నాం" "ఈ విషయమై ఇప్పటికే వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చాం. వారు సానుకూలంగా ఉంటే వెళ్లొచ్చు. తగిన ఏర్పాట్లు చేస్తాము. సీనియర్లతో అతడు కలిసిపోయేందుకు



కొంత సమయం పట్టొచ్చు. ఆ ఉద్దేశంతోనే మేము వైభవ్‌కు సాయం చేస్తున్నాం. అతడు వయసు 15 ఏళ్లే. అతడు జట్టుకు అలవాటుపడి సౌకర్యవంతంగా ఉండటానికి సమయం పడుతుంది" అని పేర్కొన్నారు. మరోవైపు సెలక్షన్ ప్రక్రియ అనంతరం చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్.. వైభవ్‌ను పొగడ్తలతో ముంచెత్తాడు. జట్టులోకి అతడిని అతడే ఎంపిక చేసుకొన్నాడని అగార్కర్ కామెంట్ చేశారు. "మీరేం మాట్లాడుతున్నారు. అతడేం చేశారో మీరే చూశారుగా. ఐపీఎల్ ప్లేఆఫ్స్ చూడండి. ఒంటిచేత్తో రాజస్థాన్ రాయల్స్ భారాన్ని భుజాన మోశాడు. అతడు ఎంతబాగా ఆడుతున్నాడో నేను మీకు చెప్పనక్కర్లేదు. ఈ సీజన్‌లోనే కాదు, గత సీజన్‌లోనూ కూడా అద్భుతంగా రాణించాడు. క్రికెట్ చూసిన ప్రతి ఒక్కరూ అతడి భీకర బ్యాటింగ్‌కు ఫిదా అయ్యారు" అని అగార్కర్ వ్యాఖ్యానించాడు.

## భారత్ జట్టులోకి వైభవ్.. సచిన్ రికార్డు బద్దలు..



భారత క్రికెట్ జట్టుకు ఎంపికైన అతి పిన్నవయస్కుడిగా వైభవ్ సూర్యవంశీ (15 ఏళ్ల 71 రోజుల) రికార్డు సృష్టించాడు. సుదీర్ఘకాలంగా క్రికెట్ దిగ్గజం సచిన్ తెండుల్కర్ పేరిట ఉన్న రికార్డును ఈ బాలుడు బద్దలు కొట్టాడు. సచిన్ 1989లో 16 ఏళ్ల 205 రోజుల వయసులో పాకిస్థాన్‌పై టెస్టు అరంగేట్రం చేశాడు. నిరుడు ఐపీఎల్ అరంగేట్రంలోనే తన విధ్వంసంతో అందరినీ ఆశ్చర్యపరిచిన వైభవ్.. ఈసారి కూడా సంచలన బ్యాటింగ్‌తో పరుగుల వరద పారించాడు. మేటి బౌలర్లను కూడా చితకబాదిన ఈ కుర్రాడు.. 776 పరుగులతో 2026 ఐపీఎల్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. వైభవ్ ఆరెంజ్ క్యాప్ సహా అయిదు అవార్డులు అందుకున్నాడు. ఒక ఐపీఎల్ సీజన్‌లో అత్యధిక సిక్స్‌లు కొట్టిన బ్యాటర్‌గా.. గేల్ రికార్డును అతడు తుడిచిపెట్టాడు. వైభవ్ ఈ ఏడాది వన్డే అండర్ 19 ప్రపంచకప్ ఫైనల్లో 80 బంతుల్లో 175 పరుగులు చేసి క్రికెట్ ప్రపంచాన్ని నివ్వెరపరిచాడు. తాజా ఐపీఎల్ ప్రదర్శన తర్వాత అతణ్ని జాతీయ జట్టుకు ఎంపిక చేయాలనే డిమాండ్లు పెరిగాయి. సెలక్షన్ కమిటీకి అతణ్ని ఎంపిక చేయక తప్పలేదు. స్వయంగా అగార్కరే ఈ విషయం అంగీకరించాడు. "వైభవ్ తనను తానే ఎంపిక చేసుకున్నాడు. తన ఆటతో మాకు అతణ్ని ఎంపిక చేయక తప్పని స్థితిని కల్పించాడు" అని అన్నాడు.

## భారత్ భారీ స్కోర్.. అఫ్గానిస్థాన్ విలవిల..

ముల్లాన్ పూర్ వేదికగా అఫ్గానిస్థాన్‌తో జరుగుతున్న ఏకైక టెస్ట్‌లో భారత్ భారీ స్కోర్ చేసింది. 368/3 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్ 564/8 వద్ద డిక్లేర్ చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అఫ్గానిస్థాన్ బ్యాటర్లు భారత బౌలర్లను ఎదుర్కోలేక విలవిల్లాడారు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి 5 వికెట్ల నష్టానికి 113 పరుగులు చేసింది. రహమత్ షా 43* పరుగులతో క్రీజులో ఉన్నాడు. అఫ్గానిస్థాన్ ఇన్నింగ్స్‌లో అతడే టాప్ స్కోరర్. మిగతా బ్యాటర్లెవరూ పెద్దగా రన్స్ చేయలేకపోయారు. అబ్దుల్ మాలిక్ (16), సెదిఖుల్లా అటల్ (17), రహ్మానుల్లా గుర్బాజ్ (12), హస్మతుల్లా షాహిది (20), అఫ్సర్ జజాయ్ (3) పరుగులకే



వెనుదిరిగారు. భారత బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ, మానవ్ సుతార్ తలో రెండు వికెట్లు తీసుకున్నారు. అఫ్గానిస్థాన్ ఇంకా 451 పరుగుల వెనకంజలో ఉంది. అంతకు ముందు భారత ఇన్నింగ్స్‌లో 103 పరుగులతో బరిలోకి దిగిన శుభ్‌మన్ గిల్ 126 రన్స్‌కు వెనుదిరిగాడు. 50 పరుగులతో క్రీజులోకి వచ్చిన రిషభ్ పంత్ 81 పరుగులు చేశాడు. వాషింగ్టన్ సుందర్ 52 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ధ్రువ్ జురెల్ (19), మానవ్ సుతార్ (28), మహ్మద్ సిరాజ్ (22), కుల్‌దీప్ యాదవ్ (9) పరుగులు చేశాడు. అఫ్గాన్ బౌలర్లలో మహ్మద్ సలీమ్ సఫీ 6 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. రెహమాన్ షరీఫీ, హస్మతుల్లా షాహిది తలో వికెట్ తీసుకున్నారు.

# సినిమా

KANGANA RANAUT



# రణబాలి 100 డేస్

విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న హ్యాట్రిక్ మూవీ రణబాలిపై క్రేజీ అప్‌డేట్‌ను మేకర్స్ రివీల్ చేశారు. గండికోటలో జరిగిన లేటెస్ట్ షెడ్యూల్ పూర్తయినట్లు ప్రకటించారు. ఈ షెడ్యూల్‌తో రణబాలి షూటింగ్ వంద రోజులు పూర్తిచేసుకున్నట్లు చెప్పారు. షూటింగ్ దాదాపు 90 శాతానికిపైగా కంప్లీట్ అయినట్లు వెల్లడించారు. వీరిద్దరి కాంబినేషన్‌లో లవ్, ఎమోషనల్ సీన్లను చిత్రీకరించారట. ఔట్‌పుట్ విషయంలో ఫుల్ హ్యాపీగా ఉన్నట్లు మేకర్స్ సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. ప్రస్తుతం రణబాలికి సంబంధించి పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఫుల్ స్వింగ్‌లో సాగుతున్నాయట. టాక్సీవాలా ఫేమ్ రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వం వహిస్తుండగా మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. సెప్టెంబర్ 11నే థియేటర్లలోకి తీసుకురాబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు.

RASHMIKA MANDANNA





## అలా ఆశించడం తప్పే

- **పెద్ది వివాదంపై అనసూయ రియాక్ట్**

పెద్ది వివాదం టాలీవుడ్‌లో దుమారాన్ని రేపుతోంది. జాన్వీకపూర్ పాత్రను అభ్యంతరకరంగా చూపించడంపై ఇప్పటికే విమర్శలు రాగా తాజాగా యాంకర్ అనసూయ రియాక్ట్ అయ్యింది. ఇన్‌డైరెక్ట్‌గా మేకర్స్‌కు సోషల్ మీడియా ద్వారా కౌంటర్ ఇచ్చింది. హీరోలను నేడు గొప్పగా చూపించే ప్రయత్నంలో దర్శకులు తప్పటడుగులు వేస్తున్నారు. సమాజంలోని చెడును గొప్పగా గ్లోరిఫై చేసి చూపిస్తున్నారు. క్రియేటివ్ ఫ్రీడమ్ ఎంత ముఖ్యమో సామాజిక స్పృహ కూడా అంతే ముఖ్యం. సమాజాన్ని సంస్కరించేలా సినిమాలు ఉండాలని ఆశించడం తప్పే. కానీ దర్శకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. తప్పులను ప్రశ్నించడం క్రియేటివ్ ఫ్రీడమ్‌పై దాడి కాదు.. అంటూ పోస్ట్ పెట్టింది. పెద్దితో పాటు బుచ్చిబాబు సానాను ఉద్దేశించే అనసూయ ఈ పోస్ట్ పెట్టిందని అంటున్నారు. ప్రస్తుతం ఇది సోషల్ మీడియాలో వైరలవుతోంది.



## నర్స్ బయోపిక్‌లో కంగనా

బాలీవుడ్ హాట్ బ్యూటీ, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ హీరోయిన్‌గా నటించిన భారత భాగ్య విధాత మూవీ ఈనెల 12న థియేటర్లలోకి రాబోతుంది. ఓ నర్స్ జీవితం ఆధారంగా ఈ మూవీని రూపొందించారట. 26/11 ముంబై ఉగ్రదాడుల్లో 400 మంది ప్రాణాలు కాపాడిన నర్సు అంజలి కుల్తే జీవితం ఆధారంగా రూపొందనుందట. ఉగ్రదాడిని అంజలి ఎలా ఎదుర్కొంది? సామాన్యుల ప్రాణాలను కాపాడటానికి ఎలాంటి త్యాగానికి సిద్ధపడిందనే అంశాలను ఈ సినిమాలో చూపించబోతున్నారట. వీటితో పాటు నర్స్‌ల లైఫ్ ఎలా ఉంటుందన్నది రియలిస్టిక్‌గా ఆవిష్కరించారట. మనోజ్ తపాడియా దర్శకత్వం వహించిన ఈ మూవీని కంగనా స్వయంగా నిర్మిస్తోంది. గత రెండేళ్లుగా ప్రజాసేవలో ఉండడంతో ఈ పాత్రకు న్యాయం చేయడానికి ఉపయోగపడిందని కంగనా తెలిపింది.

## చిరు మూవీలో కన్నడ బ్యూటీ

రజనీకాంత్ కూలీ మూవీలో విలన్ పాత్రలో అదరగొట్టింది రచితా రామ్. ఈ కన్నడ బ్యూటీ తాజాగా టాలీవుడ్‌లో ఓ బంపరాఫర్ అందుకున్నట్లు సమాచారం. చిరంజీవి, బాబీ మూవీలో రచితా రామ్ ఓ కీలక పాత్రలో కనిపించనుందట. చిరంజీవి హీరోగా బాబీ డైరెక్షన్‌లో ఓ యాక్షన్ థ్రిల్లర్ మూవీ ఇటీవలే అఫీషియల్‌గా లాంచ్ అయ్యింది. ఈ మూవీ షూటింగ్ ప్రస్తుతం పొల్లాచ్చిలో శరవేగంగా సాగుతోంది. ఇందులో ఓ కీలక పాత్రలో మలయాళ హీరోయిన్ హనీ రోజ్ నటించాల్సి ఉండగా ఆమె తప్పుకుంది. ఈమె స్థానంలో రచితాను మేకర్స్ ఫైనల్ చేసేశారట. కూలీ తరహాలోనే డిఫరెంట్ షేడ్స్‌తో చిరంజీవి సినిమాలో రచితా రామ్ రోల్ సాగుతుందట. త్వరలోనే మూవీ సెట్స్‌లో అడుగుపెట్టబోతున్నట్లు తెలిసింది. 2022లో వచ్చిన సూపర్ మచ్చి సినిమాతో హీరోయిన్‌గా టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది రచితా రామ్.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.